

జాయింట్ కష్టాలు..!

- హద్దుల వివాదంతో ఎల్‌పీఎంల నమోదు
- రైతుల గగ్గోలు
- ఆన్‌లైన్‌లో ఎక్కించాలంటే ముడుపులు
- పైలెట్ గ్రామాల్లోనూ పూర్తికాని దుస్థితి

పరిష్కారం చూపలేక పోతున్న రీసర్వే



అనంతపురం కలెక్టరేట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రైతుల భూసమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం చేపడుతున్న రీ సర్వేలో ఆ సమస్య తీవ్రత మరింత పెరుగుతోందే తప్ప.. పరిష్కారం కావడం లేదు. వైసీపీ హయాంలోనూ రీసర్వే చేశారు. మండలంలో నాలుగైదు గ్రామాల కంటే ఎక్కువ పూర్తి చేయలేకపోయారు. భూసమస్యలు సైతం పరిష్కారానికి నోచుకోక అలాగే ఉండిపోయాయి. ఇప్పుడూ అదే పరిస్థితి కనిపిస్తోంది. ప్రధానంగా పక్క పక్కనే ఉన్న రైతుల పొలాల హద్దులు, మిగులు భూములు, చుక్కల భూముల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారు. చాలాభూముల విషయాల్లో జాయింట్ ఎల్‌పీఎంలు వేసి చేతులు దులిపేసుకుంటున్నారు. దీంతో వాటిని పరిష్కరించుకోలేక రైతులు గగ్గోలు పెడుతున్నారు. కొన్ని చోట్ల సబ్ డివిజన్‌కు, ఆన్‌లైన్‌లో ఎక్కించడానికి కొందరు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు ముడుపులు పుచ్చుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. కాగా నెలలు దాటుతున్నా ఇప్పటికీ అధిక శాతం మండలాల్లో ఒక గ్రామంలో కూడా రీసర్వే పూర్తి కాని దుస్థితి నెలకొంది. దీంతో భూముల సమస్యల పరిష్కారానికి ఎంత కాలం వేచి చూడాల్సి వస్తుందోననే ఆందోళన రైతుల్లో నెలకొంది.

ఇవీ సమస్యలు...

భూముల విషయంలో రైతులు పరిష్కారం కాక కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. రీసర్వే చూస్తే మాత్రం ఒక్క ఊరిలో కూడా పూర్తిగా సమస్యలు పరిష్కారం కావడం లేదు. జిల్లాలోని విడపనకల్లు మండలం ఉండబండలో రీసర్వే చేస్తున్నారు. ఈ గ్రామ పరిధిలో మొత్తం 350సర్వేనంబర్లున్నాయి. అందులో 175 సర్వే నంబర్లలో భూసమస్యలు, వివాదాలున్నాయి. 70 సమస్యలు అన్నదమ్ముల మధ్య వివాదం, పొలం హద్దు విషయాల్లో ఉన్నాయి. 20 సమస్యల్లో భూముల్లో తేడా ఉంటోంది. ఆన్‌లైన్‌లో రైతు పేరిట రెండెకరాలు ఉంటే, సాగులో 1.70 ఎకరాలు ఉంటోంది. మరో పది సమస్యల్లో సాగులో (మిగతా 6వ పేజీలో...)

కుళ్లాయిస్వామి చివరి దర్శనం

ముగిసిన గూగూడు బ్రహ్మోత్సవాలు


కుళ్లాయిస్వామి పీరు

నార్పల, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు గ్రామంలో బుధవారం కుళ్లాయిస్వామి చివరి దర్శనంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. గతనెల 27న ప్రారంభమైన గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు 13 రోజులపాటు కొనసాగాయి. స్వామి చివరి దర్శనానికి భక్తులు భారీఎత్తున గూగూడుకు తరలివచ్చారు. స్వామిని కొండన్న వంశీయులు చూపించగానే భక్తులు 'కుళ్లాయిస్వామీ.. గోవిందా..' అంటూ నినాదాలు చేశారు. దీంతో ఊరు మొత్తం గోవింద నామస్మరణతో మార్మోగింది. అనంతరం కుళ్లాయిస్వామి పీరును పెట్టెలో భద్రపరుస్తారు. తిరిగి 2026 బ్రహ్మోత్సవాల సమయంలోనే బయటకు తీస్తారు.

పీఏబీఆర్ రోడ్డుకు మహర్దశ

- రోడ్డు నిర్మాణానికి రూ.13.28 కోట్లు మంజూరు


జల్లిపల్లి-పీఏబీఆర్ రోడ్డు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): కూడేరు మండలం జల్లిపల్లి నుంచి పెన్నహోబిలం రిజర్వాయర్‌కు వెళ్లే రోడ్డుకు మహర్దశ పట్టనుంది. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఏళ్లుగా ఈ రోడ్డు గుంతలమయంగా ఉంది. మోకాలిలోతు గుంతలతో ఆ దారిలో ప్రయాణమంటేనే వాహనదారుల హడలెత్తేవారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించింది. 2019లో ప్రభుత్వం మారడంతో దానిని పక్కన పడేశారు. హెచ్చెల్సీ ఇంజనీర్లు మరోసారి ఈ ఏడాది ప్రతిపాదన పంపడంతో కూటమి ప్రభుత్వం అంగీకారం తెలపడంతోపాటు నిధులను మంజూరు చేసింది. జల్లిపల్లి నుంచి పీఏబీఆర్ వరకు ఉన్న రోడ్డు నిర్వహణ హెచ్చెల్సీ అధికారుల ఆధీనంలో ఉంది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ చొరవతోనే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని హెచ్చెల్సీ ఎస్‌ఈ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. జల్లిపల్లి నుంచి పీఏబీఆర్ వరకు ఉన్న 5.8 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.13.28 కోట్ల నిధులు కేటాయించి, పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే పీఏబీఆర్‌కు పర్యాటకుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది.


నేడు బడిలో పండుగ

- సీఎం కొత్తచెరువుకు రాక
- తల్లిదండ్రులు, విద్యార్థులతో సీఎం, విద్యాశాఖ మంత్రి భేటీ
- 'తల్లి పేరుతో మొక్క'కు శ్రీకారం


సీఎం సమావేశానికి సిద్ధమైన సభావేదిక

కొత్తచెరువు, జూలై 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నిరక్ష్యానికి గురైన విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిన పెడుతోంది. బడుల నిర్వహణలో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసేందుకు ప్రతి ఏటా ప్రభుత్వం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం) నిర్వహిస్తోంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతో పాఠశాలలను మరింత బలోపేతం చేసేలా చర్యలు చేపట్టింది. సమష్టి కృషితో బడుల్లో నాణ్యమైన విద్య, పథకాల అమలులో పారదర్శకత, అభివృద్ధి పనుల వేగవంతం చేయడానికి దోహదపడేలా మెగా పీటీఎం-2 కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గురువారం కొత్తచెరువులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు. జూనియర్ కళాశాలలో రచ్చబండ కార్యక్రమంలో భాగంగా మాధవి, ఆమె పిల్లలు పి.బాలు (ఎనిమిదో తరగతి), నరసమ్మ (ఏడో తరగతి), బేబీ (ఐదో తరగతి), సన (మూడో తరగతి)తో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 20 మంది, వారి తల్లిదండ్రులతో ఇష్టాగోష్టిలో పాల్గొంటారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులకు మ్యూజికల్ చైర్స్, తాడు లాగడం వంటి ఆటల పోటీల్లో పాల్గొంటారు. బహిరంగ సభలో మెగా పేరెంట్స్ సమావేశం (మిగతా 6వ పేజీలో...)

ఆశల ఊసులు!



- పారిశ్రామికాభివృద్ధి కోసం ఎదురుచూపు
- సేద్యానికి చేయూత కోసం రైతన్నల నిరీక్షణ
- మెరుగైన విద్య, వైద్య సేవలు కల్పించాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనపై ఆశలు

పుట్టపర్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పారిశ్రామికాభివృద్ధికి శ్రీకారం చుట్టిన దార్శనికుడు సీఎం చంద్రబాబునాయుడు. అంతర్జాతీయ కార్ల దిగ్గజం కియ రాకతో అనేక అనుబంధ పరిశ్రమలు, కేంద్ర సంస్థలు జిల్లాకు వచ్చాయి. దీంతో జిల్లాలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి. నిధులు లేక కునారిల్లుతున్న హంద్రీనీవాకు టీడీపీ పాలనలోనే మోక్షం కలిగింది. దీంతో ఉమ్మడి జిల్లాలో చెరువులకు జలకళ వచ్చింది. బీళ్లుగా ఉన్న భూములు పచ్చని పంటలతో సస్యశ్యామలం అయ్యాయి. ఐదేళ్ల వైసీపీ విధ్వంస పాలనతో నీరసించిన పలు రంగాలు ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో కోలుకుంటున్నాయి. జిల్లాను వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లాలని ఇక్కడి ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఆశలు పెట్టుకున్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో భాగంగా గురువారం జిల్లాలోని కొత్తచెరువుకు ముఖ్యమంత్రి వస్తున్నారు. ఈక్రమంలో ఆయన జిల్లాకు ఏమి వరాలు ప్రకటిస్తారోనని ఎదురుచూస్తున్నారు.

అనుకూలతలివే..

జిల్లాలో మడకశిర నుంచి కదిరి దాకా రాప్తాడు నుంచి హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తి వరకు పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూములున్నాయి. లక్ష ఎకరాలకు పైగా అసైన్డ్, ప్రభుత్వ భూములు ఉన్నాయి. జిల్లా సరిహద్దుకు సమీపంలో కర్ణాటకలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది. జాతీయ రహదారి 44 జిల్లా మీదుగా వెళ్తోంది. ఇలాంటి అనుకూలతలు ఉన్న జిల్లా అభివృద్ధికి టీడీపీ పాలన(2014-1)లో ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వ్యవసాయ అభివృద్ధితో పాటు పారిశ్రామిక (మిగతా 6లో...)

ఉద్యోగాలు ఇప్పిస్తానని టోకరా

(వివరాలు 7వ పేజీలో...)

కలకలం..!

- కళ్యాణదుర్గం, కంబదూరు తహసీల్దార్ సంతకాల ఫోర్జరీ
- గుర్తించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు
- పోలీస్‌స్టేషన్లలో అధికారుల ఫిర్యాదు


కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయం

కళ్యాణదుర్గం, జూలై 9(ఆంధ్రజ్యోతి): నకిలీ ఈ స్టాంప్‌ల కలకలం సద్దుమణగక ముందే మంగళ, బుధవారాల్లో ఫోర్జరీ సంతకాల మాయ కళ్యాణదుర్గంలో వెలుగుచూసింది. దుండగులు తహసీల్దార్ సంతకాలనే ఫోర్జరీ చేశారు. కళ్యాణదుర్గం, కంబదూరు తహసీల్దార్ సంతకాలు ఫోర్జరీ అయినట్లు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న ఆ మండలాల తహసీల్దార్లు ఇద్దరూ ఆయా పోలీస్‌స్టేషన్లలో దీనిపై ఫిర్యాదు చేశారు. కంబదూరు తహసీల్దార్ కార్యాలయ పరిధిలో కంబదూరు పంచాయతీకి సంబంధించి గ్రామ కంఠం భూములు రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ఓ దరఖాస్తు ఫాంను అందజేస్తారు. తహసీల్దార్ సంతకంతో కూడిన దరఖాస్తు ఫాం ఆధారంగానే గ్రామకంఠం భూములు కళ్యాణదుర్గం పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేస్తారు. అయితే మంగళవారం కంబదూరు గ్రామ కంఠానికి సంబంధించి రిజిస్ట్రేషన్‌కు వెళ్లడంతో అక్కడున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు కంబదూరు తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. వెంటనే తహసీల్దార్‌కు ఫోన్‌చేసి వివరాలు అడిగారు. గ్రామకంఠం భూములకు సంబంధించి ఎటువంటి దరఖాస్తు ఫాంలు తాను ఇవ్వలేదని, ఆ దరఖాస్తు ఫాంని తనకు అందించాలని తహసీల్దార్ సబ్ రిజిస్ట్రార్‌కు సూచించారు. దీంతో ఆ దరఖాస్తు ఫాంని కంబదూరు కార్యాలయానికి పంపించారు. దాన్ని పరిశీలించిన తహసీల్దార్ తన సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించి, వెంటనే కంబదూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా కళ్యాణదుర్గం తహసీల్దార్ సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసినట్లు బుధవారం గుర్తించారు. ఇంటి రుణం కోసం బ్యాంకుకు సమర్పించిన ధ్రువీకరణ పత్రాల్లో తన సంతకం ఫోర్జరీ చేసినట్లు తహసీల్దారే గుర్తించారు. దీంతో ఆయన కూడా పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలా రెండు రోజుల వ్యవధిలోనే కంబదూరు, కళ్యాణదుర్గం తహసీల్దార్ల సంతకాల ఫోర్జరీలు బయటపడటంతో ఈ రెండు తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెబ్‌ల్యాండ్‌కు సంబంధించి సంతకాలు ఏమైనా ఫోర్జరీ అయ్యాయేమో క్షుణ్ణంగా పరిశీలించాలని ఆ ఇద్దరు తహసీల్దార్లు ఆర్‌ఐలు, వీఆర్వోలను ఆదేశించారు.


సుందరంగా సరస్వతి నిలయాలు

- మెగా పీటీఎం నిర్వహణకు ఏర్పాట్లు..


కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల తరగతి గదిలో ముస్తాబు

అనంతపురం విద్య, జూలై 9(ఆంధ్రజ్యోతి): సరస్వతి నిలయాలన్నీ పచ్చని పందిళ్లు, రంగువల్లులతో కళకళలాడుతున్నాయి. పాఠశాలలో చదువుల పండుగ వచ్చేసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం) నిర్వహిస్తోంది. జిల్లాలో గురువారం పీటీఎం వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అధికారుల లెక్కల మేరకు జిల్లాలో 1739 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, 676 ప్రైవేట్ పాఠశాలలు, 28 ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు, 68 ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఈ మెగా పేరెంట్స్ పండుగ నిర్వహిస్తున్నారు. ఈ పండుగ నిర్వహణకు హెచ్ఎంలు, టీచర్లు ఆయా పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. 2,511 పాఠశాలలు, జూనియర్ కళాశాలలు కలిపి 4,37,777 మంది విద్యార్థులు చదువుతున్నారు. పిల్లల తల్లిదండ్రులందరినీ మెగా పేరెంట్స్ పండుగకు రావాలని టీచర్లు ఆహ్వానించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సరస్వతి నిలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. పాఠశాలల ఆవరణంలో రంగురంగులతో ముగ్గులు, పచ్చతోరణాలు, రంగుల కాగితాలతో అలంకరించారు. తల్లిదండ్రులతో వారి పిల్లలను నిలబెట్టి తప్పనిసరిగా ఫొటో తీయాలని నిబంధన పెట్టడంతో ప్రత్యేకంగా ప్రతి స్కూల్‌లో ఫొటో బూత్ ఏర్పాటు చేశారు.

నేడు గురుపూర్ణిమ



బాబా విగ్రహానికి అలంకరణ, వేణుగోపాల్‌నగర్‌లో నగరోత్సవం

అనంతపురం టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): సాయినాథుని జయంతి సందర్భంగా గురువారం గురుపూర్ణిమ వేడుకలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నారు. రెండ్రోజుల నుంచే పలుచోట్ల వేడుకలు ప్రారంభమయ్యాయి. సాయిసచ్చరిత్ర పారాయణాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నగరోత్సవాలు నిర్వహించారు. గురుపూర్ణిమ నేపథ్యంలో ఇప్పటికే ఆలయాలన్నింటినీ సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలతో అలంకరించారు. జిల్లావ్యాప్తంగా వున్న సాయి మందిరాలన్నీ నేడు భక్తులతో కిటకిటలాడనున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని పలు ఆలయాల వద్ద ప్రత్యేకంగా షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. మూడో రోడ్డు షిర్డీసాయి ఆలయంలో బుధవారం నుంచే అఖండసాయి సచ్చరిత్ర పారాయణం పఠించారు.

వైభవంగా నగరోత్సవం

గురుపౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం జిల్లాకేంద్రంలో వేణుగోపాల్‌నగర్ సద్గురు సాయినాథ మందిరం ఆధ్వర్యంలో సాయినాథుని నగరోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారి ఉత్సవమూర్తిని ఆశీనులు గావించి నగరవీధుల్లో ఊరేగించారు. ఉత్సవం ముందు విజయవాడ, నెల్లూరు, రాజమండ్రి ప్రాంతాల నుంచి విచ్చేసిన కళాకారులు విచిత్ర వేషధారణలు, కళాప్రదర్శనలు నిర్వహిస్తుండగా... మహిళలు సాయినామస్మరణ చేస్తుండగా.. యువత కేరింతలతో ఉత్సాహంగా సాగారు.

కదంతొక్కిన కార్మికలోకం

- అనంతలో భారీ నిరసన ర్యాలీ
- కేంద్రంపై వామపక్ష నేతల ధ్వజం

అనంతపురం విద్య, జూలై9(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ కార్మికలోకం కదంతొక్కింది. కేంద్రం తీసుకొచ్చిన చట్టాలపై తీవ్రస్థాయిలో మండిపడింది. కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ బుధవారం దేశవ్యాప్త కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెలో భాగంగా అనంతలో వామపక్షాల ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు ఐక్యంగా కదిలాయి. కృష్ణకళామందిర్ నుంచి ర్యాలీ చేపట్టారు. టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్ మీదుగా ఆస్పత్రి రోడ్డుమీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు నాగేంద్రకుమార్, రాజారెడ్డి, సీపీఐ నేత మల్లికార్జున, ఐఎఫ్‌టీయూ యేసురత్నం తదితరులు మాట్లాడారు. కార్మిక చట్టాలను రద్దుచేయడం దారుణమన్నారు. ఎన్డీఏ ప్రభుత్వానికి కార్పొరేట్ శక్తులు తప్ప.. కార్మికులు కనబడడంలేదని మండిపడ్డారు. సమ్మె హక్కును హరించే ప్రభుత్వ ప్రయత్నాలను సంఘటితంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోపాల్, వెంకటనారాయణ, రామిరెడ్డి, శ్రీనివాసులు, రమాదేవి, సరళ, సంధ్య, పద్మ, ఏఐటీయూసీ నాయకులు రాజేష్‌గౌడ్, చిరంజీవి, ఆదినారాయణ, నాగరాజు, లతీఫ్, కార్మికులు పాల్గొన్నారు.

మూతపడిన బ్యాంకులు

అనంతపురం క్లాక్‌టవర్(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బ్యాంకు ఉద్యోగులు నిరసన చేపట్టారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వరంగ జాతీయ బ్యాంకులు, ఎల్ఐసీ కార్యాలయాలు సమ్మెతో మూతపడ్డాయి. స్థానిక టవర్‌క్లాక్ వద్దగల కెనరా బ్యాంకు నుంచి అనంతపురం బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో సుభాష్‌రోడ్డు, సప్తగిరి సర్కిల్ మీదుగా నగరపాలక సంస్థ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ నిరసనకు మద్దతు తెలిపారు. బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ.. బ్యాంకుల ప్రైవేటీకరణను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. బ్యాంకుల్లో కాంట్రాక్ట్స్, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి, శాశ్వత నియామకాలు చేపట్టాలన్నారు. ఎన్‌పీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. బ్యాంకులలో ఐదు రోజుల పనివిధానాన్ని అమలు చేయాలని, మొండి బకాయిల వసూళ్లకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగుల నేతలు రమణరాజు, శివారెడ్డి, సునీత, దర్శన్, మురళి, శ్రీకాంత్, అరవింద్, వహీద్, పవన్, నవీన్ పాల్గొన్నారు.


అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు




బ్యాంకు ఉద్యోగుల ర్యాలీ

ఆశల ఊసులు..!

(5వ పేజీ తరువాయి)

హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేశారు. ఏపీఐఐసీ ద్వారా అనేక మౌలిక వసతులు ఏర్పాటు చేయించారు. ఈనేపథ్యంలో కర్ణాటకతో పోలిస్తే జిల్లాలో భూముల ధరలు తక్కువగా ఉండటం, హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలతో నీటికి ఇబ్బంది లేకపోవడం, మెరుగైన రహదారులు ఉండటంతో పారిశ్రామికవేత్తల చూపు జిల్లా పడింది. మరిన్ని పరిశ్రమలు ఏర్పాటైతే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవనున్నాయి.



లేపాక్షి టెంపుల్ వ్యూ

35వేల ఎకరాల భూసేకరణ

జిల్లాలో ఇప్పటికే ఐదు పారిశ్రామిక హబ్‌ల ఏర్పాటుకు 35వేల ఎకరాల భూ సేకరణకు వేగం పెంచారు. జిల్లాలో రూ. 11920 కోట్ల పెట్టుబడులతో రెండు ఎనర్జీ ఉత్పత్తి సంస్థలు ఏర్పాటుకు ముందుకు రాగా 4130 మంది ఉపాధి అవకాశం కల్పించే ప్రాజెక్టులు ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. జిల్లాలో బొండాడ ఇంజనీరింగ్ సంస్థ 2000 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఈప్రాజెక్టును రూ. 9000 కోట్ల పెట్టుబడితో 3900 మందికి ఉద్యోగ అవకాశలు కల్పించేలా ఏర్పాటు చేయనున్నారు. గత ఏడాది నుంచే జిల్లాలో 41 పరిశ్రమలకు 1056 ఎకరాల భూముల కేటాయించారు. ఇప్పటికే జిల్లాలో 8678 ఎంఎస్ఎంఈలతో 54847 మందికి, 48 మధ్య తరహా పరిశ్రమలతో 25682 మందికి, 18 భారీ పరిశ్రమలతో 65వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి. పరోక్షంగా లక్షలాదిమందికి ఉపాధి లభిస్తోంది. ఉమ్మడి జిల్లాతోపాటు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలు, ఇతర దేశాల నుంచి ఉపాధి కోసం జిల్లాకు క్యూకట్టారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం మరింత ఊతమిస్తే పారిశ్రామికంగా జిల్లా మరింత దూసుకెళ్లడం తథ్యం.

నీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలి

జిల్లాలో ఆగిపోయిన సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీరు ఇచ్చే జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పుంగనూరు కాలువ గట్టుకు ఇరువైపులా లైనింగ్ కోసం రూ. 930.70 కోట్లు కేటాయించింది. వందరోజుల్లో పూర్తి చేయాలన్న లక్ష్యంతో 230 కిలోమీటర్ల లైనింగ్ పనులు వేగంగా సాగుతున్నాయి. చిలమత్తూరు, గోరంట్ల మండలాలకు తాగు, సాగు నీరు అందించేందుకు మడకశిర ఉప కాలువ పనులు చేపట్టాల్సి ఉంది. మడకశిర ఉపకాలు వెడల్పు, లైనింగ్‌తోపాటు హంద్రీనీవా బైపాస్ కెనాల్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. పుట్టపర్తి నియోజకవర్గానికి సాగునీరిచ్చే 193 చెరువుల ఎత్తిపోతల పనులు వేగం పెంచాలి. రాప్తాడు నియోజకవర్గానికి సాగు నీరు అందించేందుకు హంద్రీనీవా కింద గత వైసీపీ ప్రభుత్వం శంకుస్థాపన చేసిన ముట్టాల, తోపుదుర్తి, దేవరకొండ రిజర్వాయర్లను నిర్మించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. ముదిగుబ్బ మండలంలో చేపట్టిన జిల్లేడుబండ ప్రాజెక్టును పూర్తి చేయాలని ఆ మండల ప్రజలు కోరుతున్నారు.

సమగ్ర వ్యవసాయ అభివృద్ధి కోసం..

ఇది 42 రకాల ఉద్యాన పంటల సాగుకు అనుకూలమైన జిల్లా. టమోటా, మామిడి, అరటి, దానిమ్మ, పంటలు ఎగుమతుల్లో జిల్లాకు అగ్రస్థానం లభించింది. అయితే కొన్నేళ్లుగా అతివృష్టి, అనావృష్టితో ఇబ్బంది పడుతున్న రైతులను ఆదుకోవాల్సి ఉంది. జిల్లాలో ఎక్కువ శాతం వర్షాధార భూములున్న నేపథ్యంలో హంద్రీనీవా పథకాన్ని పొడిగించి మరిన్ని రిజర్వాయర్లు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. రైతుకు చేయూత ఇచ్చే పథకాలను అందించి, వ్యవసాయాన్ని పండుగలా చేయాలని కోరుతున్నారు. కాగా జిల్లా యువతకు సమగ్ర నైపుణ్య శిక్షణ ఇప్పించాలని, లేపాక్షి నాలెడ్జి భూములకు బంధ విముక్తి కల్పించాలని జిల్లా ప్రజలు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.

విద్య, వైద్యం, టూరిజం అభివృద్ధిపై ఆశలు

ఉన్నత విద్య కోసం జిల్లాలోని విద్యార్థులు ఉమ్మడి అనంతతోపాటు ఇతర జిల్లాలకు పరుగులు పెటాల్సి వస్తోంది. మెరుగైన వైద్యం కోసం కూడా ఇదే పరిస్థితి ఉంది. జిల్లాలో ఉన్నత విశ్వవిద్యాలయాలతోపాటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు చేసి మూడేళ్లు దాటినా పక్కా భవనాలు లేక పరాయి పంచనే పాలన సాగిస్తోంది. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించాలని కోరుతున్నారు. ప్రాచీన కట్టడాలు, ఆలయాలు, ప్రకృతి అందాలకు నెలవైన జిల్లాలో టూరిజాన్ని అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉంది. పుట్టపర్తిలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విమానాశ్రయాన్ని పబ్లిక్ ఎయిర్ పోర్టుగా చేసి పౌరవిమానాశ్రయ సేవలు ఎలా ప్రారంభించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేపట్టాయి. దీన్ని సఫలం చేసి ఎయిర్ కనెక్టివిటీని పెంచాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు అమరాపురంలో వక్క మార్కెట్ ఏర్పాటు చేయాలని అక్కడి రైతులు కోరుతున్నారు.

నేడు బడిలో పండుగ



తల్లికి వందనం పథకం లబ్ధిపొందిన పిల్లలతో తల్లి

(5వ పేజీ తరువాయి)

జరుగుతుంది. తరువాత ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 120 మందితో సహపంక్తి భోజనాన్ని చేయనున్నారు. ఇందులో 40 మంది ఉపాధ్యాయులు, 40 మంది బాలికలు, 40 మంది బాలురు ముఖ్యమంత్రితో సహపంక్తి భోజనాలు చేయనున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 2,516 ఉండగా ఇందులో 2,19,638 మంది విద్యార్థులు చదువుతున్నారు.

తల్లి పేరుతో ఒక మొక్క

తల్లిపేరుతో ఒక మొక్క (ఏక్ పేడ్ మాకే నామ్) నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రతి విద్యార్థి నాటి పెంచేందుకు అవసరమైన మొక్కలను పంపిణీ చేయనున్నారు. వాటిని విద్యార్థులు ఇంటి వద్ద లేదా పాఠశాల్లో నాటి సంరక్షించాల్సి ఉంటుంది. ఇందుకు గాను విద్యార్థులకు గ్రీన్‌పాస్‌పోర్టు విద్యాశాఖ అధికారులు ఇస్తారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మొక్కను పరిశీలించి విద్యార్థులకు గ్రేస్ పాయింట్లు కేటాయిస్తారు.

నేటి మధ్యాహ్న భోజన మెనూ ఇదే..

ప్రభుత్వ పాఠశాలలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న బడి భోజనంలో భాగంగా గురువారం మెనూ ప్రకారం.. వెజిటబుల్ రైస్, పలావ్, బంగాళ దుంప కూర్మా, ఉడికించిన గుడ్డు, రాగి జావా విద్యార్థులకు అందించనున్నారు. ఈ ఆహార పదార్థాలను విద్యార్థులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భుజించనున్నారు.

విద్యార్థుల ప్రగతిపై ప్రోగ్రెస్ కార్డులు

మెగా పేరెంట్ టీచర్ సమావేశం జరిగే రోజునే తమ పిల్లలు పాఠశాలల్లో విద్యలో ఎలా ఉన్నారు, వారి ప్రవర్తనశైలిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చదువులో పాటించాల్సిన నియమాలను ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందిస్తారు. ఎస్ఎస్ఏ ద్వారా ముద్రించిన కార్డులను ఇవ్వనున్నారు. విద్యార్థులు ఏ రంగంలో మక్కువ చూపుతున్నారు, ఆరోగ్య పరీక్షలు, పిల్లలు ఇళ్ల వద్ద ఎలా చదువుతున్నారు వంటి విషయాలతో పాటు తల్లిదండ్రుల అభిప్రాయాలను ఈ కార్డుల ద్వారా పంచుకోనున్నారు.

నలుగురు పిల్లలకు తల్లికి వందనం


ప్రభుత్వం అందించిన తల్లికి వందనం పథకం కింద నలుగురు పిల్లలకు కలిపి రూ.52వేలు ఖాతాలో జమ అయింది. నా పిల్లలు బాలు 8వతరగతి, నరసమ్మ 7వతరగతి, బేబి 5వతరగతి, సన 3వ తరగతి చదువుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మా పిల్లల్లో ఒకరికి మాత్రమే అమ్మఒడి నగదు జమ అయింది. ప్రస్తుతం నలుగురు పిల్లలకు నగదు జమ కావడం ఆనందంగా ఉంది. మా లాంటి పేద కుటుంబాలకు ఈ నగదు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఈ డబ్బును పిల్లలకు చదువులకు ఉపయోగిస్తున్నా.

-మాధవి, తల్లి, కొత్తచెరువు

బడులు తెరవగానే పుస్తకాల పంపిణీ

బడులు తెరవగానే ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ప్రభుత్వం అందించింది. జిల్లా వ్యాప్తంగా 12,26,760 పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు 8,39,762, డిక్షనరీలు 27,987, బ్యాగులు 1,39,948, షూలు 1,40,241, యూనిఫామ్ మూడుజతలు 1,39,948 మందికి, బెల్టులు 98,764 మందికి పంపిణీ చేసింది. వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థులు పాఠ్యపుస్తకాలు అందక ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా..



కొత్తచెరువు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొత్తచెరువు పర్యటన షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఆయన గురువారం ఉదయం 8 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి 8-10 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 8-15 గంటల బయలుదేరి 9 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరతారు. 9-10 గంటలకు అక్కడి నుంచి బయలు దేరి రోడ్డు మార్గాన 9-25 గంటలకు కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వస్తారు. 9-30 నుంచి 9-55 గంటల వరకు తల్లి, పిల్లలతో సంభాషణ కార్యక్రమం ఉంటుంది. 9-55 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు నడిచి వెళతారు. ఒంటి గంట వరకు తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు. ఒంటి గంటకు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు కాలినడక వెళ్లి అక్కడి నుంచి 1-10 గంట ప్రశాంతి నిలయం చేరుకుంటారు.

1-15 గంటల నుంచి 2-15 వరకు ప్రశాంతి నిలయాన్ని సందర్శిస్తారు. 2-15 గంటలకు ప్రశాంతి నిలయం నుంచి రోడ్డు మార్గాన పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. 2-35 గంటలకు విజయవాడకు విమానంలో బయలు దేరివెళతారు.

నారా లోకేశ్ షెడ్యూల్..

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం రాత్రి పుట్టపర్తి మండలం కప్పలబండ వద్ద ఏర్పాటు చేసిన విడిది కేంద్రానికి చేరుకున్నారు. గురువారం ఉదయం 9-15 గంటలకు అక్కడి నుంచి రోడ్డు మార్గాన కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు 9-30 గంటలకు చేరుకుంటారు. 10 గంటల నుంచి 2 గంటల వరకు మెగా పీటీఎం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం తిరిగి విజయవాడకు బయలుదేరి వెళతారు.

అయ్యో..! చంద్రప్ప



చంద్రప్ప ఆధార్‌కి లింకైన అన్‌సెటిల్డ్ భూముల జాబితా





చంద్రప్ప

- సెంటు భూమిలేని కూలీ 300 ఎకరాలకు ఆసామి
- 'తల్లికి వందనం'తో బయట పడిన రెవెన్యూ లోపాలు
- పథకం అందక లబోదిబోమంటున్న నిరుపేద కూలీ

చిలమత్తూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆయన్ను చూస్తే అందరూ కూలీ అనుకుంటారు. ఆయన కూడా అలాగే అనుకుని ప్రతి రోజూ కూలి పనులకు వెళ్తాడు. కానీ ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆయన 300 ఎకరాలకు ఆసామి. ఇంత పెద్ద భూస్వామికి సంక్షేమ పథకాలు ఎందుకని ప్రభుత్వం ఆపేసింది. దీంతో రెక్కాడితేగాని డొక్కాడని తనకు ఇంత భూమి ఉన్నట్లు కనీసం కల కూడా రాలేదని ఆ కూలీ వాపోతూ తహసీల్దార్‌ను కలిశాడు. అరెరే పొరపాటు జరిగిందే అని ఆ అధికారి సైతం నాలుక్కరుచుకున్నాడు. అధికారులు చేసిన పొరపాటుకు తాను ప్రభుత్వ పథకాలు కోల్పోతున్నట్లు ఆ కూలి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఆ కథా కమామిషు ఇలా..

చిలమత్తూరు మండలంలోని శానగానపల్లికి చెందిన చంద్రప్పకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు విష్ణు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కుమార్తె కేజీబీవీలో పదోతరగతి చదువుతోంది. ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకానికి వారు ఇద్దరు అర్హులు. అయితే ఇద్దరికీ ఆ పథకం వర్తించలేదు. దాంతో అతడు సచివాలయంలో గ్రీవెన్స్ ఫిర్యాదు చేశాడు. చంద్రప్ప ఆధార్ నంబర్‌కి చాగలేరు రెవెన్యూ పొలంలోని సుమారు 300 ఎకరాలకు పైగా అన్‌సెటిల్‌గా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూములు లింక్ అయ్యి ఉన్నట్లు సచివాలయ అధికారులు తెలిపారు. దీంతో ఆయన తనకు సెంటు భూమి కూడా లేదని, మూడు వందల ఎకరాలు ఎలా వచ్చాయని నేరుగా తహసీల్దార్ నటరాజ్‌ని కలిసి ప్రశ్నించాడు. రికార్డులను పరిశీలించిన తరువాత తహసీల్దార్ కూడా షాక్ అయ్యాడు. సాంకేతిక కారణాలతో ఇలా జరిగిందని, దానిని సరిచేస్తామని అతడికి హామీ ఇచ్చారు. తనకు లేని భూమిని ఉన్నట్లుగా చూపి తల్లికి వందనం పథకం అందకుండా చేశారని చంద్రప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై తహసీల్దార్ నటరాజు మాట్లాడుతూ సాంకేతిక సమస్యతో అలా జరిగి ఉంటుందని, అందుకోసం టెక్నీషియన్‌తో మాట్లాడి బాధితుడు చంద్రప్ప ఆధార్‌కు లింక్ చేసిన భూములను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డ్రిప్ త్వరగా మంజూరు చేయాలి

- ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి

అనంతపురం అర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్హులైన రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం పీడీ కార్యాలయంలోని తన చాంబర్‌లో డ్రిప్ కంపెనీల డీసీఓలు, ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. గత ఆర్థిక సంవత్సరంలో పెండింగ్‌లోని డ్రిప్ పరికరాల సరఫరా, తుది పరిశీలన ప్రక్రియను ఈనెల 20వతేదీలోగా పూర్తి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 18వేల హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింకర్ల పరికరాల మంజూరు లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. పరికరాలు అవసరమైన అర్హులైన రైతులతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించడంతోపాటు కొత్త మార్గదర్శకాల మేరకు నాన్‌సబ్సిడీ మొత్తాన్ని చెల్లించేలా ప్రత్యేక చొరవ చూపాలని వివరించారు.

15న హంద్రీనీవాకు నీటి విడుదల

- కొలిక్కివచ్చిన వెడల్పు పనులు
- సీజన్ తరువాత లైనింగ్ పనులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై9(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవాకు ఈనెల 15న మల్యాల పంప్‌హౌస్ వద్ద శ్రీశైలం డ్యాం నుంచి కృష్ణా జలాలను విడుదల చేయనున్నట్లు జిల్లా జలవనరుల శాఖ ప్రాజెక్టుల సీఈ నాగరాజ తెలిపారు. మల్యాల వద్ద 12 పంపుహౌస్‌లకు 3,850 క్యూసెక్కుల సామర్థ్యం ఉంది. 15వ తేదీన రెండు పంపుహౌస్‌ల నుంచి 600 క్యూసెక్కుల నీటిని వదలనున్నారు. రెండు మూడు రోజుల తరువాత మిగిలిన పంపుహౌస్‌ల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని వదిలేలా ప్రణాళికలు చేసుకున్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు జిల్లాలో కొలిక్కి వచ్చాయని, 15లోపు పూర్తి చేయనున్నట్లు సీఈ తెలిపారు. 15న మల్యాల వద్ద నీటిని విడుదల చేస్తే..18న జిల్లా సరిహద్దు రాగులపాడుకు చేరుకుంటాయని వివరించారు. మిగిలిన లైనింగ్ పనులు సీజన్ తరువాతే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది 50టీఎంసీల వరకు హంద్రీనీవాకుకేటాయించినట్లు ఇంజనీర్లు చెబుతున్నారు.

అవసరం మేరకే ఎరువులు వాడాలి

- జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకే పంటల వారిగా తగిన మోతాదులో ఎరువులు వాడుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎరువులు సరఫరా, కొనుగోలు విషయంలో ఎవరికైనా సందేహాలుంటే స్థానిక ఏఓ, ఏడీఏలను సంప్రదించాలని అన్నారు. జిల్లాలో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి జిల్లాలో వివిధ రకాల ఎరువులు 49,828 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో యూరియా 14,035 మెట్రిక్ టన్నులు, డీఏపీ 4,344, ఎంఓపీ 4,864, ఎన్‌పీకే కాంప్లెక్స్ ఎరువులు 23,732 మెట్రిక్ టన్నులు, సూపర్ పాస్పేట్ 2,682 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పంటలకు అధిక ఎరువులు వాడటం ద్వారా భూసారం దెబ్బతిని, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. పంటల వారిగా సిఫార్సు మేరకు రైతులు తగిన ఎరువులు వేసుకోవాలని సూచించారు. ప్రతి రైతు ఎరువుల డీలర్ వద్ద ఈ పోస్ ఆధారంగా ఆధార్ బయోమెట్రిక్ ద్వారా ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. తప్పనిసరిగా డీలర్ నుంచి రసీదు పొందాలన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, నల్లబజారుకు తరలించినా సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే సంబంధిత వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలని సూచించారు.

నీటికుంటల లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- డ్వామా పీడీ సలీం బాషా



కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న డ్వామా పీడీ సలీం బాషా

అనంతపురం అర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటికుంటల లక్ష్యం మేరకు పూర్తి చేసేందుకు ప్రత్యేక చొరవ చూపాలని డ్వామా పీడీ సలీం బాషా ఆదేశించారు. బుధవారం డ్వామా కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏపీడీ సుధాకర్‌రెడ్డితో కలిసి క్లస్టర్ ఏపీడీలు, మండల ఏపీఓలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఏడాది జిల్లాకు 9వేల ఫాంపాండ్స్ లక్ష్యం ఇవ్వగా ఇప్పటి దాకా 3,683 పూర్తి చేశారని, నెలాఖరులోగా నిర్దేశించిన మేరకు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించే మెగా పేరెంట్ టీచర్ మీట్‌లో 4వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులతో అమ్మ పేరుతో మొక్కలు నాటించేందుకు కృషి చేయాలన్నారు. స్థానిక విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులను సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఇళ్ల వద్ద కంపోస్ట్ పిట్స్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఇంటి వద్ద కంపోస్ట్ పిట్స్‌ను ఏర్పాటు చేసేలా చొరవ చూపాలని పేర్కొన్నారు.

భారతీయ సంస్కృతి మహోన్నతమైనది

- రాజస్థాన్ గవర్నర్ హరిబాహు కిషన్‌రావు





మహాసమాధిని దర్శించుకుంటున్న రాజస్థాన్ గవర్నర్, సత్కరిస్తున్న రత్నాకర్

పుట్టపర్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి మహోన్నతమైనదని రాజస్థాన్ గవర్నర్ హరిబాహు కిషన్‌రావు పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని ప్రశాంతినిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో శ్రీసత్యసాయి మానవతా విలువలపై బుధవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజస్థాన్ గవర్నర్ జ్యోతి వెలిగించి, సదస్సును ప్రారంభించారు. గవర్నర్ ప్రసంగిస్తూ.. సనాతన ధర్మం శాశ్వతమైందన్నారు. సనాతన ధర్మాన్ని హృదయంలో ప్రతిష్ఠించుకుని, సేవాభావంతో జీవించాలని పిలుపునిచ్చారు. ఆత్మతత్వంలోనే పరమాత్మం ఉందనీ, మానవసేవే ఈశ్వర సేవ అని అన్నారు. సత్యసాయిబాబా ఈ భావనతోనే సేవా కార్యక్రమాలు కొనసాగించారన్నారు. సత్యసాయి ప్రేమ తత్వం, ఆధ్యాత్మిక బోధనలు కోట్లాది మంది ప్రజలకు జీవిత పరమావధిగా మారాయన్నారు. సత్యసాయి.. పేదలకు అందిస్తున్న విద్య, వైద్యం, తాగునీటి సేవలు అనన్యమైనవని కొనియాడారు. సత్యసాయి చూపిన విలువలతో కూడిన విద్యనభ్యసించి సమాజహితం కోసం జీవన గమనాన్ని సాగించాలంటూ పేర్కొన్నారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అంతకుమునుపు రాజస్థాన్ గవర్నర్‌కు, రాజ్యసభ సభ్యుడు భగవత్ ఖరడ్‌కు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ స్వాగతం పలికి, సన్మానించారు. రామకృష్ణ మిషన్ వీసీ స్వామి సర్వోత్తానంద, సేవాదళ్‌జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే సత్యసాయి మానవతా విలువలపై ప్రసంగించారు. సత్యసాయి విద్యార్థులు బ్యాండ్ మేళం, మంగళవాయిద్యాలతో భక్తులను అలరింపజేశారు. వేడుకల్లో సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు సభ్యులు చక్రవర్తి, నాగానంద, యూనివర్సిటీ వీసీ రాఘవేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

జాయింట్ కష్టాలు..!

(5వ పేజీ తరువాయి)

ఒకరుంటే ఆన్‌లైన్‌లో మరొకరి పేరుంది.

జాయింట్ ఎల్‌పీఎం ముసుగులో వసూళ్లు...

రైతుల భూముల హద్దుల విషయంలో తేల్చకుండా వాటిని జాయింట్ ల్యాండ్ పార్శిల్ మ్యాప్(ఎల్‌పీఎం)లో పెట్టేస్తున్నారు. అలా చేయడంతో సంబంధిత రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో స్ప్లిట్ ద్వారా మార్చమని అడిగితే ఆప్షన్ లేదని, ఆన్‌లైన్ సహకరించడంలేదని చెబుతున్నారట. జాయింట్ ఎల్‌పీఎం చేశాక తొలుత సంబంధిత రైతులకు నోటీసులిస్తారు. అనంతరం ఆన్‌లైన్‌లో సబ్ డివిజన్ చేసి జాయింట్ ఎల్‌పీఎం నుంచి వేరు చేస్తారు. ఈ వ్యవహారం చేయడానికి ధరలులేని భూముల్లో రూ.5వేల నుంచి రూ.20వేల వరకు, ధరలున్న ప్రాంతాల్లో రూ.50వేలకుపైగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. మిగులు భూములతో పాటు సాగులో ఒకలా, పుస్తకంలో మరోలా ఉంటుంది. అలా భూమిలో తేడా ఉన్నపుడు సాగులో ఎవరుంటే వారికి చేయాలనే నిబంధన ఉంది. వాటికి కూడా జాయింట్ ఎల్‌పీఎం పేరిట చేస్తున్నారట. దీంతో అలా డబ్బులు ఇచ్చుకోలేని వారు తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణ చేస్తున్నారు.

ఫీల్డ్‌కు వెళకుండా.. రెవెన్యూలో జోక్యం..

ప్రస్తుతం రీ సర్వేలో డిప్యూటీ తహసీల్దార్‌గా చలామణి అవుతున్న వారందరూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ) స్థాయి ఉద్యోగులే. వైసీపీ హయాంలో 2022 డిసెంబరులో రీసర్వే పేరుతో ఆర్ఐలను అడ్‌హక్ హోదాతో డీటీలుగా చేశారు. మరోసారి 2024లో ఎక్స్‌టెన్షన్ చేసుకున్నారు. వీరి ఆధ్వర్యంలోనే రీ సర్వే కొనసాగుతోంది. శ్రీసత్యసాయి జిల్లాలో రామగిరి మండలంలో తహసీల్దార్ లేకపోవడంతో రీసర్వే డీటీకి తహసీల్దార్‌గా ఇచ్చారంటే పరిస్థితి ఎంతవరకు వచ్చిందో అర్థమవుతుంది. వారిలో చాలామంది క్షేత్రస్థాయిలో భూములు పరిశీలించడం లేదనే ఆరోపణలున్నాయి. విలేజ్ సర్వేయర్లతో సర్వే పనులు చేయించి, కేవలం రికార్డులు తిరగేసి వ్యవహారం నడుపుతున్నారన్న విమర్శలున్నాయి. వీరిలో కొందరు రెవెన్యూ పనుల్లో జోక్యం చేసుకుంటున్నారట. చుక్కల భూములు, 22ఏ, వెబ్‌ల్యాండ్ కరెక్షన్, ఆర్ఓఆర్ అప్పీళ్లు, ల్యాండ్ కన్వర్షన్, వివాదాలున్న భూముల విషయంలో తలదూర్చి పైసలు వసూలు చేస్తున్నారని సమాచారం.



వసూళ్లలో ముదుర్లు

కొందరు డీటీలు, సర్వేయర్లు రీసర్వే ముసుగులో బాగా ముదిరిపోయారట. గుంతకల్లు నియోజకవర్గంలోని ఓ మండలంలో 9నెలలుగా రీసర్వే డీటీగా చేసి తాజాగా మరో మండలానికెళ్లిన అధికారి రూ.కోట్లకు పడగలెత్తారట. ఈ మధ్యనే ఓ కారు కొనుగోలు చేశారట. ఆ మండలంలోని ఓ రైతుకు చెందిన 35 సెంట్ల మిగులు భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకోవడానికి రూ.5లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం. 'నాకేమైనా భూమి అమ్ముతున్నారా..? అంత డబ్బు ఇవ్వలేను.. మీరే తీసేసుకోండి' అంటూ ఆ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడట. ఓ రీసర్వే డీటీ కలెక్టరేట్‌లో పోస్టు ఇప్పించుకున్నారు. అక్కడ ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల్లో చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు పౌరసరఫరాల శాఖకు బదిలీ చేశారు. విలేజ్ సర్వేయర్లు సైతం సబ్ డివిజన్ వ్యవహారంలో బాగానే ముడుపులు పుచ్చుకుంటున్నారని తెలిసింది. ఆన్‌లైన్‌లో ఎక్కించే విషయంలోనూ, రెవెన్యూ సంబంధిత వ్యవహారాల్లో పైసలు లేనిదే పనిచేయరనే స్థాయికి వచ్చారు. రీ సర్వే జరిగిన భూముల్లో కొన్ని పట్టా ల్యాండ్‌లుగా ఉన్న వాటిని డీ పట్టా అని పెడుతున్నారనే విమర్శలున్నాయి. వీటిని వెబ్‌ల్యాండ్ కరెక్షన్ చేయాలంటూ మరో రూ.60 వేలు రైతులు ఖర్చు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మళ్లీ ఇక్కడ రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి వాళ్లకు డబ్బు సమర్పించుకోవాల్సిందే.

ఆ పాపం ఇంకా...

శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలో గత వైసీపీ హయాంలో జరిగిన ఘనకార్యంతో ఓ రైతు ఇంకా తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఓబుళాపురానికి చెందిన మోహన్‌కు 8 ఎకరాల భూమి ఉంది. రీసర్వేలో ఆ భూమికి 4 రోడ్డు పాయింట్లు చూపారట. అలా జాయింట్ ఎల్‌పీఎం పెట్టడం ద్వారా ఆయన భూమికి విలువ తగ్గిపోయింది. ఈ విషయంలో అప్పటి అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు ఇచ్చుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఫోన్‌పే చేసిన ఆధారాలతో ఉన్నతాధికారులను కలిసినా ప్రయోజనం లేకపోయింది. అలా వేరు చేసుకోవడానికి నానా తిప్పలు పడుతున్నారట. ప్రస్తుత అధికార పార్టీలో నలుగురు ఎమ్మెల్యేలు తెలిసినా ఆయన సమస్య పరిష్కరించుకోలేక పోతున్నారట. అదే సమయంలో ఆయన ఇంటికి సంబంధించి గతంలో ఉన్న సర్వేయర్లు రోడ్డు విషయంలో ఇల్లు తప్పిపోతుందని సర్వే ఇస్తే... ఆ తరువాత ఓ వ్యక్తి రోడ్డు విస్తరణలో ఇల్లు సగం కట్ అయ్యేలా రిపోర్ట్ ఇచ్చారట.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో టీచర్ ఆత్మహత్య


అంకిరెడ్డి(ఫైల్)

అనంతపురం న్యూటౌన్/అనంతపురం విద్య, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఉపాధ్యాయుడు అంకిరెడ్డి(45) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం రాత్రి 11.30 గంటల సమయంలో పీటీసీ గ్రౌండ్ ఎదురుగా రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం వచ్చినట్లు రైల్వే ఎస్ఐ వెంకటేశులు తెలిపారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, మృతుడు వయసు దాదాపు 45 సంవత్సరాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. గూడ్స్ రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహం వద్ద ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని శవంగా కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఇంటి నుంచి బయటికెళ్లి..

బుధవారం ఉదయం మృతుడిని బుక్కరాయసముద్రం మండలంలోని సిద్దరాంపురం జడ్పీ హైస్కూల్‌లో పని చేస్తున్న తెలుగు స్కూల్ అసిస్టెంట్ అంకిరెడ్డిగా గుర్తించారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్‌నగర్‌లో నివాసం ఉంటున్న అంకిరెడ్డి అంధుడు. ఈయనకు భార్య లక్ష్మీదేవి, ఇంటర్ చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. అంకిరెడ్డి ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడేవాడని ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇంట్లోనే ఫోన్‌ను పెట్టి బయటకు వెళ్లారు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కొంత ఆందోళన చెందారు. అయితే అప్పుడప్పుడు రాత్రి పూట ఆలస్యం అయితే.. నాలుగో రోడ్డులోని అంధుల అసోసియేషన్ కార్యాలయంలో ఉండి వచ్చేవారని తెలిపారు. దీంతో ఉదయం వస్తారులే అనుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతిచెందాడన్న సమాచారాన్ని తెలుసుకుని కుటుంబ సభ్యులు రైల్వే పోలీసులను సంప్రదించారు. వారి సహకారంతో ప్రభుత్వ వైద్యశాలలో మృతదేహాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుడు అంకిరెడ్డిగా గుర్తించి బోరుమని విలపించారు. కాగా సేవల పేరుతో అనవసర విషయాల్లో తలదూర్చి డబ్బులు బాగా ఖర్చు పెట్టి, అప్పులపాలైనట్లు పలువురు టీచర్లు అభిప్రాయపడ్డారు. మంచితనంతో తలకు మించిన పనులు నెత్తికెత్తుకుని అప్పుల ఊబిలో కూరుకుపోయినట్లు తెలిపారు. ఇవే ఆయన ఉసురు తీసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని టోకరా

- యువకుడిని విచారించిన తిరుపతి పోలీసులు

పుట్లూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికిన ఓ వ్యక్తి లక్షలు మోసం చేసినట్లు సమాచారం. పుట్లూరు మండలంలోని కొండుగారికుంటకు చెందిన ఓ యువకుడు తిరుపతిలో ఫేక్ అకౌంట్లు సృష్టించి కొందరు నిరుద్యోగులను మోసం చేసినట్లు తెలిసింది. దీంతో తిరుపతిలోని సైబర్‌క్రైం పోలీసులు బుధవారం సదరు యువకుడితోపాటు కుటుంబ సభ్యులను విచారించినట్లు సమాచారం. సుమారు రూ.2.35 లక్షలు మేర నిరుద్యోగుల నుంచి వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆ యువకుడిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి తిరుపతి సైబర్‌క్రైం పోలీసులు విచారించినట్లు తెలిసింది. తిరుపతి కేంద్రంగా పలు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రచారం చేసి ఫేక్ బ్యాంక్ అకౌంట్లు సృష్టించి పలువురి నుంచి డబ్బులను ఖాతాల్లో వేయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై స్థానిక ఎస్ఐ వెంకటనరసింహం వివరణ కోరగా.. విచారించడం మాట వాస్తవమేనని తెలిపారు.

పోక్సో కేసు నమోదు

తాడిపత్రి, జూలై 9(ఆంధ్రజ్యోతి): పెద్దపప్పూరు మండల కేంద్రంలోని హేమంత్ అనే యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. మండలానికి చెందిన బాలికను మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి దూర ప్రాంతాలకు తీసుకెళ్లాడు. యువకుడి ఫోన్ ఆధారంతో పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి పోక్సోచట్టం కింద కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సవీరా ఆస్పత్రి నర్సు అనుమానాస్పద మృతి

- తల్లితో ఫోన్‌లో మాట్లాడిన 5 గంటల్లోనే ఘటన
- ఆస్పత్రి వద్ద బంధువులు, ఏఐటీయూసీ నేతల ధర్నా


దివ్య(ఫైల్)

అనంతపురం క్రైం, జూలై 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని సవీరా ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న దివ్య(25) ఉన్నఫలంగా మృతి చెందింది. ఆమె మృతి పలు అనుమానాలకు తావిస్తోంది. ముదిగుబ్బకు చెందిన సుకన్య, శంకర్ దంపతుల కుమార్తె దివ్య స్టాఫ్‌నర్సుగా సుమారు ఐదేళ్ల నుంచి సవీరా ఆస్పత్రిలో పని చేస్తోంది. ఆ ఆస్పత్రికే చెందిన హాస్టల్లో ఉంటోంది. అయితే బుధవారం ఆమె ఉన్నఫలంగా మృతి చెందడంపై అనేక అనుమానాలకు తావిస్తోంది. ఉదయం 9 గంటలప్పుడు ఆమె తన తల్లితో మాట్లాడినట్టు తెలుస్తోంది. తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ మరణించింది. ఆమె హాస్టల్లోనే మరణించిందా.. లేక ఆస్పత్రిలో మరణించిందా అనేది అనుమానాలకు తావిస్తోంది. ఉదయం దివ్య తల్లితో మాట్లాడితే.. మధ్యాహ్నం 2.30 గంటలప్పుడు మీ అమ్మాయికి ఆరోగ్యం బాగోలేదు..వెంటనే రండి అంటూ తల్లిదండ్రులకు సమాచారం వెళ్లింది. దీంతో ఆమె తల్లిదండ్రులు ఆస్పత్రి యాజమాన్యంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి యాజమాన్యం ఏం జరిగిందో చెప్పడం లేదంటూ వాపోతున్నారు. తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని, దర్యాప్తు చేసి నిజమేంటో తేల్చాలంటూ మృతురాలి తల్లి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో కూడా పని ఒత్తిళ్లు ఉన్నాయని చెప్పిందని, ఉదయం మాట్లాడిన అమ్మాయి...మధ్యాహ్నానికి మరణించడం ఏంటని ప్రశ్నించింది. అయితే ఆమె అనారోగ్య కారణంగా చనిపోయినట్టు ఆసుపత్రి వర్గాలు వెల్లడిస్తున్నట్టు తెలుస్తోంది. కడుపు నొప్పితో బాధపడుతుండేదని, ఈ క్రమంలోనే మృతి చెంది ఉండవచ్చునని చెబుతున్నట్టు సమాచారం. బాధితులకు న్యాయం చేయాలంటూ బంధువులు, ఏఐటీయూసీ నాయకులు ఆస్పత్రి వద్ద రాత్రి ఆందోళన చేశారు. దివ్య మృతికి కారణాలు తేల్చాలని డిమాండ్ చేశారు. అయితే ఆమె పని ఒత్తిడి వల్ల చనిపోయిందా... లేక నిజంగా అనారోగ్య కారణాలు ఉన్నాయా అన్నది పోలీసుల విచారణలో తేలే అవకాశం ఉంది.


ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, బాధితులు

రాజేష్.. లేవరా..!

- ఐదుగురం కలిసి ఉన్నాం.. నేడు వదిలేసి పోయావా..
- మృతుడి తల్లిదండ్రులు, తోబుట్టువుల కన్నీరు
- ప్రభుత్వాస్పత్రిలో గుండెలవిసేలా రోదన


రాజేష్ మృతదేహం

అనంతపురం వైద్యం, జూలై 9(ఆంధ్రజ్యోతి): 'రేయ్.. రాజేష్.. లేవరా.. ఇంటికెళ్దాం. ఉదయం వరకు ఐదుగురం కలిసి ఉన్నామే.. ఇప్పుడు మమ్మల్ని వదిలేసి పోయావా' అంటూ ఆ కుటుంబసభ్యులు రోదించిన తీరు అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది. ఈ ఘటనకు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వేదికగా మారింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం నింబగల్లుకు చెందిన కూలీలు వెంకటేష్, లక్ష్మీదేవి దంపతులకు కుమార్తె జ్యోతి, ఇద్దరు కుమారులు నరేష్, రాజేష్ ఉన్నారు. సెంటు భూమి లేకపోయినా, కూలి పనులు చేస్తూ, రేకులషెడ్డులో నివసిస్తూ పిల్లలను డిగ్రీ వరకు చదివించారు. ఉద్యోగాలు రాకపోవడంతో నరేష్, రాజేష్(21) బెంగళూరులోని ప్రైవేట్ సంస్థల్లో పని చేస్తున్నారు. తమ అక్క అయిన జ్యోతిని పీజీ చదివిస్తున్నారు. ఈ క్రమంలో రాజేష్‌కు కాలి నొప్పి రావడంతో ఈనెల 4న ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఆర్థోపెడిక్ విభాగంలో చూపించుకున్నారు. పరీక్షించిన డాక్టర్లు కాలి ఎముకలో చీము పట్టిందని, ఆపరేషన్ చేయాలని రాజేష్‌ను అడ్మిట్ చేసుకున్నారు. ఈనెల 7న ఆపరేషన్ చేశారు. అప్పటి నుంచి డాక్టర్ల సూచనల మేరకు రాజేష్‌కు ఆహారం అందిస్తూ, సపర్యలు చేశారు. బుధవారం ఉదయం ఇడ్లీ తినిపించారు. ఈ క్రమంలో రాజేష్ ఊపిరాడకా ఇబ్బంది పడ్డాడు. డాక్టర్లు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. రాజేష్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆర్థోపెడిక్ వార్డు ఎదుట ఆందోళనకు దిగారు. డాక్టర్ల నిర్లక్ష్యంతోనే రాజేష్ మృతి చెందినట్లు ఆరోపించారు. సోమవారం ఆపరేషన్ చేస్తే.. బుధవారం ఉదయం వరకు బాగున్న తమ కుమారుడు ఎలా చనిపోతారని డాక్టర్లను ప్రశ్నించారు. మాలాంటి పేదలు పెద్దాసుపత్రికి వస్తే ప్రాణాలు పోగొట్టుకుని వెళ్లాల్సి వస్తోందని కన్నీటి పర్యంతరమయ్యారు. రాజేష్ మృతదేహానికి ఫోరెన్సిక్ విభాగం డాక్టర్లు శంకర్ నాయక్ తదితరులు సాయంత్రం పోస్టుమార్టం నిర్వహించారు. సీఐ శ్రీకాంత్ యాదవ్ కేసు నమోదు చేసుకున్నారు.


రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

- గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్



అనంతపురం క్రైం, జూలై 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా బంగారు పాళ్యంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ మూకలు దాడి చేయడం అమానుషమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొహిద్దీన్ పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బంగారు పాళ్యంలో మార్కెట్ యార్డు వద్ద విధి నిర్వహణలో ఉన్న శివకుమార్‌పై దౌర్జన్యం చేస్తూ కెమెరా చిప్స్ లాక్కుని, దాడులు చేయడం దుర్మార్గమన్నారు. గతంలో రాప్తాడులో సిద్ధం సభలో ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ నాయకులు దాడి చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ అదే జగన్ పర్యటనలో ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడిచేసి, ఇష్టానుసారంగా కొట్టడం సరికాదన్నారు. ప్లాన్ ప్రకారమే వైసీపీ నాయకులు దాడులు చేయడం పత్రికా స్వేచ్ఛను కాలరాయడమేనంటూ మండిపడ్డారు. జగన్ రాజకీయ డ్రామాలను, వైసీపీ సైకో బ్యాచ్ చర్యలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన తెలిపారు.

స్వీడన్ కోర్సుల దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురంరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ, బ్లెకింగ్ వర్సిటీ(స్వీడన్) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ కోర్సుల దరఖాస్తు గడవు పొడిగించారు. ఈనెల 17వతేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఎఫ్ఏఅండ్ఏఎం డైరెక్టర్ సుజాత సంయుక్త ప్రకటనలో తెలిపారు. బీటెక్ మూడేళ్లు జేఎన్‌టీయూ క్యాంపస్, చివరి సంవత్సరం విద్యను బీటీహెచ్, స్వీడన్‌లో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. బీఎస్ పట్టాను బ్లెకింగ్ వర్సిటీ ప్రదానం చేస్తుందన్నారు. ఆ తరువాత ఎంఎస్ స్వీడన్‌లో చేయవచ్చు అన్నారు. జేఈఈ, ఈఏపీసెట్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో గాని అర్హత సాధించాలని అన్నారు. గురువారం నుంచి స్పాట్ అడ్మిషన్లు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 8008802558, 9989944533, 9441889732 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కలెక్టరేట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని సీఎం చంద్రబాబు ఖూనీ చేస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి బుధవారం ప్రకటనలో ఆరోపించారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతుల కష్టాలు తెలుసుకునేందుకు వైసీపీ అధినేత జగన్ వెళ్లిన సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన స్పందించారు. రైతు సమస్యలపై జగన్‌కు ఉన్న బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. జగన్ రైతులతో మాట్లాడేం దుకు వెళ్తే కార్యకర్తలు, రైతుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదన్నారు. జగన్‌ను కలిస్తే రౌడీషీట్లు తెరుస్తామంటూ ఎస్పీ స్థాయి వ్యక్తి బెదిరిం చడం చూస్తే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అనే అనుమానం కలుగుతోందన్నారు.

చెత్త సేకరణపై జడ్పీ సీఈఓ ఆరా


మహిళతో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ శివశంకర్

రాప్తాడు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు కాలనీల్లో బుధవారం జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి మహిళలతో మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు ఇంటింటా చెత్త సేకరణను సక్రమంగా చేస్తున్నారా లేదా అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత నీటి ట్యాంకులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈఓఆర్డీ ఆనంద్‌ప్రసాద్, సర్పంచ్ సాకే తిరుపాలు, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

22న పారా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్, సబ్‌జూనియర్ పారా అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 22వ తేదీన నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. ఆసక్తి, అర్హత గల పారా అథ్లెటిక్ క్రీడాకారులు ఈనెల 19వతేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 9న విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్ క్రీడాపోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు.. 9390388189, 8074106154లను సంప్రదించాలని పేర్కొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి: డీఎంహెచ్ఓ


వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

గార్లదిన్నె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి వైద్యులకు సూచించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులను వైద్య పరీక్షలు సకాలంలో అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరై ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి మంజుల, సీహెచ్ఓ లోక్‌నాథ్, సూపర్‌వైజర్ నరసమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటుకోళ్ల దొంగను పట్టుకోండి

అనంతపురం క్రైం, జూలై 9(ఆంధ్రజ్యోతి): 'మా నాటు కోళ్లు దొంగిలించారు. దొంగ గోడ దూకి వచ్చి 5 కోళ్లు పటుకెళ్లాడు. ఆ దొంగను పట్టుకుని, మా కోళ్లు మాకు ఇప్పించండి" అంటూ బాధితుడు 4వ పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శ్రీనివాసనగర్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఏఈఓ జయరాముడుకి నారాయణపురం నుంచి నరసనాయుని కుంటకు వెళ్లే దారిలో వ్యవసాయ పొలం ఉంది. పొలంలో ఇంటితోపాటు కోళ్ల పెంపకానికి ఒక షెడ్డు ఏర్పాటు చేసుకున్నాడు. షెడ్డు కాంపౌండ్ వాల్ కూడా ఉంది. అయితే ఈ నెల 6న రాత్రి 10 గంటలప్పుడు ఓ దొంగ గోడ దూకి కోళ్ల షెడ్డు వద్దకు చేరుకున్నాడు. షెడ్డు బండలు పగలగొట్టి, అందులోని నాటు కోళ్లను ఎత్తుకెళ్లాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఈ మేరకు బాధితుడు 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఒక్కో నాటుకోడి రూ. 3500 నుంచి రూ.4 వేలు ఉంటుందని, 5 కోళ్లు పోయాయని వాపోయాడు. తనకు పోలీసులు న్యాయం చేయాలని కోరాడు.

బీఎంఈలో అనంత టాప్


విద్యార్థుల బరువు, ఎత్తు పరీక్షిస్తున్న అధికారుల, సిబ్బంది

అనంతపురం వైద్యం, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు వారి వయసుకు తగ్గ ఎత్తు, బరువు ఉన్నారా? లేదా? అనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం బాడీమాస్ ఇండెక్స్(బీఎంఈ) కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమ నిర్వహణలో రాష్ట్రంలో అనంతపురం జిల్లా ప్రథమ స్థానం నిలిచిందని రాష్ట్రీయ బాల స్వస్థ ఆరోగ్య జిల్లా సమన్వయకర్త డాక్టర్ నారాయణస్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి నుంచి పదో రతగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువున్న విద్యార్థులకు గత సంవత్సరం హెల్త్‌కార్డులు మంజూరు చేసిందన్నారు. ఆరోగ్య వివరాలకు అదనంగా ఎత్తు, బరువు వివరాలను హెల్త్‌కార్డుల్లో నమోదుచేసేందుకు బీఎంఈ స్ర్కీనింగ్ చేపట్టామన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి ఆధ్వర్యంలో ఐదు రోజుల్లో 1747 ప్రభుత్వ పాఠశాలల్లో 2,13,608 మంది విద్యార్థులకు గాను 1,99,744 మందికి స్ర్కీనింగ్ చేశామన్నారు. దీంతో రాష్ట్రంలో 93.51శాతంతో ప్రథమ స్థానం నిలిచామని పేర్కొన్నారు. ఈ స్ర్కీనింగ్‌లో 1110 మంది ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పనిచేశారని వివరించారు. గురువారం నిర్వహించే పేరెంట్, టీచర్, మీటింగ్(పీటీఎం) సమావేశాల్లో బీఎంఈ వివరాలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఐఈసీ మేనేజర్ రజిత, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకారా కృషివల్లే పెన్షనర్లకు ప్రశాంత జీవితం

- ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు వెంకటేశులు
- ఘనంగా డీఎస్ నకారా విగ్రహావిష్కరణ

అనంతపురం టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అందరూ సకాలంలో పెన్షన్ పొందుతూ ప్రశాంత జీవితం గడుపుతున్నారంటే దానికి డీఎస్ నకారా చేసిన కృషే కారణమని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు వెంకటేశులు పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా అనంతపురం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో పెన్షనర్ల పితామహుడు డీఎస్ నకారా విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. తొలుత క్లాక్‌టవర్ కూడలి నుంచి పెన్షనర్స్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పెన్షనర్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన డీఎస్ నకారా విగ్రహాన్ని వెంకటేశులు చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం కృష్ణకళామందిర్‌లో నిర్వహించిన సమావేశంలో వెంకటేశులు మాట్లాడుతూ.. డీఎస్ నకారా అలహాబాద్ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ లిటరేచర్‌లో బంగారు పతకం అందుకున్నారన్నారు. 1977కు ముందు పదవీ విరమణ చేసిన వారికి చాలా తక్కువగా వచ్చే పెన్షన్లలో సైతం ప్రభుత్వాలు వివిధ కారణాలతో కోతలు విధించేవని, అప్పట్లో అత్యధికంగా రూ.675 మాత్రమే పెన్షన్ ఉండేదన్నారు. కొద్దిపాటి వేతనంతో జీవనం గడవడం కష్టతరంగా ఉండేదన్నారు. ఈ పరిస్థితులను గమనించిన నకారా సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేశారని తెలిపారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్, ఆంధ్ర పెన్షన్స్ పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి జయరామప్ప, నాయకులు చల్లా లక్ష్మి, అనంతయ్య, అబ్దుల్ కరీమ్, నారాయణస్వామి, నాగభూషణం, గౌరీకాంత్, గోవిందరాజులు పాల్గొన్నారు.


నకారా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశులు

భూముల కేటాయింపు పూర్తి కావాలి: జేసీ


మాట్లాడుతున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి ప్రభుత్వ భూముల కేటాయింపులు త్వరితగతిన పూర్తి కావాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ సెక్టార్‌పై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓలు, జిల్లా రిజిస్ట్రార్, డీఎస్ఓ, తహసీల్దార్లు, ఆర్ఎస్డీటీలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... 544డీకి సంబంధించి తాడిపత్రి మండలంలో అధిక శాతం భూమి సేకరణ పెండింగ్ ఉందని, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు వారంలోగా పంపించాలన్నారు. సోలార్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించి యాడికి మండలంలో కొంత ప్రభుత్వ భూమిని అప్పగించారని, మిగిలిన భూమికి సంబంధించి రెండు వారాల్లోపు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఏపీఐఐసీకి సంబంధించి గార్లదిన్నె మండలం కనుంపల్లిలో అర్హులైన పట్టాదారులకు ఆర్డీఓ ద్వారా పరిహారం చెల్లించాలని, ఇందుకు సంబంధించి రెండ్రోజుల్లోపు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, సూపరింటెండెంట్ రియాజుద్దీన్, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తల్లిని పూజించడం భారతీయ ధర్మం

- అద్వైత పీఠం స్వామీజీ అతిదేశ్వరానంద


ప్రసంగిస్తున్న అద్వైత పీఠం స్వామీజీ అతిదేశ్వరానంద

అనంతపురం టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): తల్లిని పూజించడం భారతీయ సనాతన ధర్మం అని అద్వైత పీఠం అతిదేశ్వరానంద పేర్కొన్నారు. ఏపీ మేదరి(మహేంద్ర) సంఘం ప్రధాన కార్యదర్శి పోలేపల్లి నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని మల్లాలమ్మ దేవాలయంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి అతిదేశ్వరానంద స్వామీజితోపాటు జపాన్‌కు చెందిన యుషి స్వామీజి, భూతిహేన్ తిరో స్వామీజి, శ్రీలంకకు చెందిన కౌని పలిత హరో స్వామీజీలు హాజరయ్యారు. స్వామీజీలకు ఆలయం వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీలు మల్లాలమ్మ దేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అతిదేశ్వరానంద స్వామీజి ప్రసంగించారు. ప్రపంచ దేశాల్లో భూమిని సైతం తల్లిగా భావించేది ఒక్క భారతీయులే కావడం గర్వకారణమన్నారు. మేదరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలేపల్లి నాగరాజు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా మేదరిలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అతిదేశ్వరానంద స్వామీజిని కోరారు. ఐదు దశాబ్దాలుగా మేదరులను ఎస్టీ జాబితాలోకి మార్చాలని గల్లీ నాయకుల నుంచి ఢిల్లీ నాయకుల వరకు ఎన్నోమార్లు మెమొరాండాలు ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేదరి సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చలపతి, జిల్లా గౌరవాధ్యక్షుడు కాకర్ల ప్రభాకర్, అధ్యక్షుడు రామచంద్ర, ప్రధాన కార్యదర్శి మురళి, కోశాధికారి మహేష్, ప్రచార కార్యదర్శి మధు పాల్గొన్నారు.

IN THE HIGH COURT JUDICATURE OF ANDHRA PRADESH
AT AMARAVATI
ARBAPPL 45/2023

Between

M/s. BSP Hydro Dredging Works Pvt Ltd
Rep by its Managing Director S.N Vishnu
Having its registered office at D/No 3-10-87/16,
Flat No 401, DSR Residency,
Near Rly Gate, Garagaparru Road,
Bhimavaram 534202 ... Applicant

And

PJRN Earth Movers
rep by its Managing Director
P. Janardhana Naidu,
D/No. 11/973, Near Sai Appartments,
Aravinda Nagar, Ananthapur-515001 ....Respondent

To

PJRN Earth Movers
rep by its Managing Director
P Janardhana Naidu,
D/nO 11/973, Near Sai Appartments,
Aravinda Nagar, Ananthapur, 515001

Please take notice that the above named applicant filed ARBAPPL 45/2023 on the file of the Hon'ble High Court seeking to appoint the Arbitrator Under Section 11(5)&(6) of Arbitration & Conciliation Act pursuant to the Agreement dt 01-12-2020. The notices was sent to you by RPAD and the same was returned un-served.

Thus, the Hon'ble High Court permitted the applicant to serve notice to you by way of paper publication and the matter stands posted on 18-07-2025 for your appearance through your advocate or personally.

Ghantasala Udaya Bhaskar, Advocate
High Court of Andhra Pradesh
Counsel for the Applicant

చంద్రబాబుతోనే సుపరిపాలన

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

అనంతపురంరూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. మండలంలోని ఏ. నారాయణపురంలో బుధవారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా స్థానిక టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం మా ట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో అభివృద్ధిలో వెనుకబడిన రాష్ట్రం ఇప్పుడు చంద్రబాబు పాలనలో మళ్లీ గాడిన పడుతోందన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించడం ఆయనతోనే సాధ్యమన్నారు. నగరంలోని డంపింగ్ యార్డును అక్టోబరు 2 నాటికి పూర్తిస్థాయిలో త రలిస్తామని తెలిపారు. అలాగే రూ.750కోట్ల వ్యయంతో అండర్ డ్రైనేజీ, రూ.80కోట్లతో నడిమి వంక, మరువవంక ప్రొటెక్షన్ వాల్స్ నిర్మిస్తామని అన్నారు. నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆది నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు డిష్‌నాగరాజు, రాష్ట్ర తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి రఘునాథ్, పలుకార్పొరేషన్ డైరెక్టర్లు పరమేశ్వర్, కడియాల కొండన్న, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌యాదవ్, నాయకులు బాలా, ఈశ్వరయ్య, వడ్డే హరి, వెంకటలక్ష్మి, వరాలమ్మ, హాజీ, నెట్టెంబాలకృష్ణ, ఈడిగనాగభూషణం, జయరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనుల పరిశీలన

అనంతపురంరూరల్: మండలంలోని ఏ. నారాయణపురంలో నిర్మిస్తున్న బ్రిడ్జిని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్రిడ్జి పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. మరికొన్ని రోజుల్లోనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి అవుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు.

ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

అనంతపురం క్రైం: నెల్లూరు జిల్లా కొవ్వూరు వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రకటనలో హెచ్చరించారు. మహిళా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు. మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు సాఫ్ట్ కార్నర్ వల్లే వైసీపీ నేతలు రెచ్చిపోతున్నారన్నా రు. వారు ఇలాగే మాట్లాడితే.. ప్రజలతోపాటు తాము కూడా బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యం

● ఎమ్మెల్యే పరిటాల సునీత


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పరిటాల సునీత

అనంతపురంరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని పూలకుంట గ్రామంలో బుధవారం సాయంత్రం ఆమె సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ శ్రేణులతో కలిసి గ్రామంలోని ప్రధాన రహదారితో పాటు బీసీ, ఎస్సీ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. బీసీకాలనీలో సీసీరోడ్లు వే యాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు అలాగే తాగునీటి సమస్య పరిష్కారం కోసం విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలన్నారు. వెంటనే ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి వారంరోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడా ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక మళ్లీ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. తర్వాత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అక్కులరెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్, చియ్యేడు సాయినాథ్ రెడ్డి ఇతర దాతల సహకారంతో ఏర్పాటు చేసిన రక్షిత తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభించారు. టీడీపీ మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి షేక్షావలి నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి రాగేమురళీ,గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెగా పీటీఎంకు ఆహ్వానం

అనంతపురం క్రైం: రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను నగరంలోని క్యాంపు కార్యాలయంలో డీఈఓ ప్రసాద్ బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పాల్గొనే మెగా పీటీఎం కార్యక్రమానికి సంబంధించిన గ్రీన్ పాస్‌పోర్ట్ కార్డులను ఆమెతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం అధికారులు ఎమ్మెల్యేను మెగా పీటీఎంకు ఆహ్వానించారు.

ఎమ్మెల్యేను కలిసిన సొసైటీ చైర్మన్లు

రాప్తాడు: మరూరు, బుక్కచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సొసైటీ)చైర్మన్‌లుగా ఎంపికైన మరూరు గోపాల్, బ్రహ్మానందరెడ్డి ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌ను అనంతపురం లో గల క్యాంపు కార్యాలయంలో కలిశారు. గజమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో నమ్మకంతో సొసైటీ చైర్మన్‌లుగా అవకాశం కల్పించారని, రైతులకు అందుబాటులో ఉండి బాధ్యతగా పనిచేస్తామని తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కిష్టా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కనగానపల్లి: మండల కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే పరిటాల సునీత పర్యటించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య ప్రకటనలో తెలిపారు. స్థానిక కేజీబీవీలో నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో పాల్గొంటారన్నారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించే మెగా పీటీఎంలలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు తప్పకహాజరుకావాలని ఆయన కోరారు.

డంపింగ్ యార్డుకు అనుమతులు ఇవ్వకుండా చూడండి

అనంతపురంరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): తమగ్రామంలో డంపింగ్ యార్డుకు అనుమతులు ఇవ్వకుండా చూడాలని నరసనాయనికుంట గ్రామస్థులు కోరారు. ఆమేరకు బుధవారం ఎమ్మెల్యే పరిటాల సునీతను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మాజీ సర్పంచు వేణుగోపాల్, మార్కెట్ యార్డు డైరెక్టర్ అనిల్ చౌదరి, డీలర్ రవీంద్ర పాల్గొన్నారు.

చెన్నంపల్లిలో టీడీపీ - వైసీపీ వర్గీయుల ఘర్షణ

● పరస్పరం దాడులు చేసుకోవడంతో పలువురికి గాయాలు


గాయపడిన టీడీపీ వారు

బుక్కరాయసముద్రం, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంపల్లిలో బుధవారం టీడీపీ- వైసీపీ వర్గీయులు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో వైసీపీకి చెందిన 9 మంది గాయపడగా, టీడీపీకి చెందిన ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. వైసీపీకి చెందిన ఈశ్వరయ్య కుమారుడు భాస్కర్ పెరుగు ప్యాకెట్ కోసం కిరాణాషాప్ వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో టీడీపీకి చెందిన నాగప్ప భార్య భాస్కర్‌ను దుర్భాషలాడింది. దీంతో భాస్కర్ వెళ్లి విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపాడు. ఇందుకు ఈశ్వరయ్య, తమ్ముడు ఎర్రన్నగారి వెంకటస్వామి , కిష్టన్న, వారి కుటుంబ సభ్యులు వెళ్లి ఎందుకు మా వాడిని తిట్టావని నాగప్ప కుటుంబ సభ్యులను ప్రశ్నించారు. ఈక్రమంలో రెండు వర్గాల వారు వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తులైన వారు పరస్పరం కర్రలతో దాడులు చేసుకున్నారు. ఇందులో వైసీపీకి చెందిన ఇల్లూరు లక్ష్మిరెడ్డి, వెంకటరమణ, వెంకటస్వామి, నారాయణస్వామి, ఈశ్వరయ్య, వెంకటేశ్వరమ్మ, బాబుతో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. అలాగే టీడీపీకు చెందిన విజయ్‌కుమార్‌రెడ్డి, జయరామిరెడ్డి, ఫణిభూషణ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, మనోహర్‌రెడ్డిలు గాయపడ్డారు. అయితే టీడీపీ నేతలు మాత్రం గురుపౌర్ణమి వేడుకలు చేస్తుండగా వైసీపీ నేతలు కావాలని అడ్డుకోవడంతోనే ఈ గొడవ జరిగిందని చెబుతున్నారు. వైసీపీ వర్గీయులు మాత్రం టీడీపీ వర్గీయులే తొలుత రెచ్చిపోయి ఇంటిపైకి వచ్చి దాడులు చేశారని పేర్కొంటున్నారు. వెంటనే సంఘటనా స్థలం వద్దకు సీఐ పుల్లయ్య చేరుకుని గ్రామంలో బందోబస్తు నిర్వహించారు. గాయపడిన వారిని అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. రెండు వర్గాలపై కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

అండర్ పాస్ ఏర్పాటుకు ఎంపీ హామీ

శింగనమల, జూలై 9(ఆంధ్రజ్యోతి): శింగనమల మరవకొమ్మ వద్ద అండర్ పాస్ ఏర్పాటుకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హామీ ఇచ్చారు. మండలానికి చెందిన టీడీపీ నాయకులు గుత్తా ఆదినారాయణ, మారుతీనాయుడు, మాసూలచంద్రమోహన్, వెంకటేశ్, పెద్దనగముని, సుంకన్న చెన్నయ్య గుర్రం లక్ష్మీనారాయణ తదితరులు ఎంపీని అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మరవకొమ్మ వద్ద గల జాతీయ రహదారి నుంచి శింగనమలలోకి వెళ్లడానికి అండర్ పాస్ లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే ఈ సమస్యపై పలుమార్లు తెలిపామన్నారు. దీనికి పరిష్కారం చూపాలని కోరారు. ఇందుకు ఎంపీ మాట్లాడుతూ.. ఈ విషయంపై ఇప్పటికే హైవే అధికారులతో పలు మార్లు మాట్లాడామన్నారు. గతంలో వ చ్చిన కాంట్రాక్టకు పనులు పూర్తి అవడంతో.. మరలా కాంట్రాక్టర్ టెండర్ వేసి పనులు చేస్తారన్నారు. కొత్త పనుల్లో భాగంగా మరవకొమ్మ వద్ద శింగనమలకు పోవడానికి అండర్ పాస్ కోసం ప్రణాళికలు తయారు చేసి పంపామన్నారు. రెండు మూడు రోజుల్లో అనుమతులు వస్తాయన్నారు. అం తవరకు శింగనమల వెళ్లే రోడ్డుకు తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేయిస్తామని అన్నారు. మరవకొమ్మ వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

ఎస్‌ఏఎస్‌లో పట్టుసాధిస్తే ఉపాధి అవకాశాలు

అనంతపురం రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): క్లినికల్ ట్రయల్స్ రంగం లో ఎస్‌ఏఎస్(స్టాటిస్టికల్ అనాలసిస్ సిస్టం)ప్రోగ్రామింగ్‌లో పట్టు సాధి స్తే విద్యార్థులు ఉపాధి అవకాశాలను విస్తృతంగా మెరుగుపరచుకోవచ్చునని ప్రవాస భారతీయ సాంఖ్యక శాస్త్రవేత్త, డేటా సైంటిస్ట్ డాక్టర్ వెంకట్ ఇక్కుర్తి సూచించారు. జేఎన్‌టీయూలో బుధవారం తైలసాంకేతిక, ఔషధ పరిశోధనా సంస్థల సంచాలకులు ఆచార్య జీవీసుబ్బారెడ్డి నేతృత్వంలో బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఫార్మాడీ విద్యార్థులకు ఫార్మసీ రంగంలో ప్రత్యామ్నాయ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అనే అంశం మీద అవగాహన సదస్సు జరిగింది. ఇందులో అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రంలో ఉన్న ప్రవాస భారతీయ సాంఖ్యక శాస్త్రవేత్త వెంకట్ ఇక్కుర్తి పాల్గొని మాట్లాడారు. స్టాటిస్టికల్ అనాలసిస్ సిస్టం ప్రోగ్రామింగ్ యొక్క ఆవశ్యకతను వివరించారు. ఓటీపీఆర్ఐ కళాశాల ప్రిన్సిపాల్ గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల పురోగతి సూచికపై శిక్షణ

అనంతపురం న్యూటౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీల పురోగతి సూచిక 2.0పై జిల్లా స్థాయి అధికారులతోపాటు, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ప్రతి మండలం నుంచి ఒక పంచాయితీ కార్యదర్శి, ఒక డిజిటల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం సమావేశ భవనంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో శిక్షణలో వివరించిన విధంగా పంచాయతీల్లో అమలయ్యేలా చూడాలని అధికారులు సిబ్బందికి సూచించారు. పంచాయతీ పురోగతి సూచికలో పొందుపరిచిన అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకొని అక్కడ అమలయ్యేలా చూడాలని తెలిపారు. డీఎల్‌పీఓ విజయ్‌కుమార్, శిక్షకులు నిర్మల్‌దాస్, నరసింహారెడ్డి, గంగిరెడ్డి, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ సీనియర్ నాయకుడి మృతి


కొట్టాల కొండయ్య(ఫైల్)

శింగనమల, జూలై 9(ఆంధ్రజ్యోతి): పెరవలి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కొట్టాల కొండయ్య(75) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొద్ది రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన బుధవారం మృతి చెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగారు. ఆయనకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొండయ్య మృతికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, మాజీ మేయర్ సర్వాప, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


రాప్తాడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

రాప్తాడు, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మికుల చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాలుగు లేబర్ కోడ్‌లను వెం టనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు అరుణ డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం రాప్తాడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులకు రక్షణ లేకుండా చేస్తోందన్నారు. వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

●చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో అంగన్‌వాడీలు, ఆశాకార్యకర్తలు నిరసన సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. తర్వాత డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామికి అందజేశారు.

●గార్లదిన్నె : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు ఆందోళన చేశారు. తర్వాత పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి ఎండీ రాముడు, రైతు కూలీ సంఘం మండల కార్యదర్శి రాజశేఖర్‌శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

●శింగనమల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, అంగన్వాడీ వర్కర్లు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అంతకుమునుపు ర్యాలీ నిర్వహించారు.

●కనగానపల్లి: మండలకేంద్రంలో వామపక్ష పార్టీల నాయకులు, పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల వద్ద ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు కార్మికుల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల నిర్వీర్య కుట్రలను తిప్పికొట్టాలి

అనంతపురం వైద్యం: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడం, కార్మికచట్టాలను నిర్వీర్యం చేయడం వంటి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరముందని ఎల్ఐసీ ఉద్యోగులు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తసమ్మె పిలుపు మేరకు బుధవారం నగరంలోని ఎల్ఐసీ బ్రాంచ్-2లో ఉద్యోగులు సిబ్బంది సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానకార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. ఎల్ఐసీలో ప్రభుత్వం తన వాటాలను ఉపసంహరించుకునేలా బీమా చట్టాల సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనుందన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే సంస్థకు, పాలసీ దారులకు తీవ్రనష్టం జరుగుతుందని వాపోయారు. జీఎస్టీ రూపంలో బీమా ప్రీమియంలపై భారాన్ని మోపడంతో పాలసీదారుల సంఖ్య తగ్గిపోయిందన్నారు. నియామకాలు, పాత పెన్షన్ విధానం, జీఎస్టీ తగ్గింపు వంటి డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

పంటల బీమాకు దరఖాస్తు చేసుకోండి

రాప్తాడు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ పంటల బీమా కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ కృష్ణ చైతన్య సూచించారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ఈ మేరకు తెలిపారు. మూడు రకాలుగా పంటల బీమా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఉద్యానశాఖ అధికారి దివ్య, ఏఈఓ రంజిత, వీహెచ్ఏ సోనియా, వీఏఏ శ్రీనివాసులు, ఎంపీఈఓ పద్మ , రైతులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా: ఏఐఎస్ఎఫ్

అనంతపురం విద్య, జూలై 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బకాయి ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ డబ్బులను మంజూరు చేయాలంటూ ఈనెల11న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుల్లాయప్ప తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ. 6వేల కోట్లకు పైగా రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయన్నారు. దీంతో కాలేజీ యాజమాన్యాలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని అంటున్నాయని, దీంతో విద్యార్థులు మానసికవేదనకు గురవుతున్నారని వాపోయారు. ఈబకాయి నిధులు వెంటనే విడుదల చేయాలని ధర్నా చేపట్టనున్నామన్నారు. విద్యార్థులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకుల ఆంజనేయులు, వెంకట్‌నాయక్, మంజునాథ్, సమీర్ పాల్గొన్నారు.

బాలాజీ ఫార్మసీ కళాశాలలో సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న వెంకట నెర్లపాటి

అనంతపురంరూరల్, జూలై9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు రోడ్డు సమీపంలో గల బాలాజీ ఫార్మసీ కళాశాలలో అల్ట్రాసౌండ్ ఆధారిత ఫార్మసీ శాస్త్ర సదస్సును బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ ఎడ్యుకేషనల్ స్పీకర్ డాక్టర్ వెంకట నెర్లపాటి హాజరై మెడికల్ టెక్నాలజీలో ఏర్పడుతున్న మార్పులను, ఫార్మసీ రంగంలో అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు ఎలా అవలంబించాలో వివరించారు. కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిశోర్, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్


బొడ్రాయికి పూజలు చేస్తున్న ప్రజలు

వర్షం కోసం బొడ్రాయికి పూజలు

గుంతకల్లుటౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): వర్షం కురవాలని పాత గుంతకల్లులోని బొడ్రాయికి బుధవారం రైతులు, ప్రజలు పూజలు చేశారు. శివాలయంలోని కోనేరు బావిలో నుంచి నీరు తీసుకుని బొడ్రాయిని అభిషేకించారు. ప్రత్యేక పూజలు చేశారు.

కన్వీనర్ రేసులో పదిమంది

పుట్లూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండల కన్వీనర్ పదవి కోసం పది మంది పోటీ పడుతున్నారని టీడీపీ మండల అబ్జర్వర్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండలంలోని నాయకునిపల్లి సుంకులమ్మ ఆలయం వద్ద ఆయన పార్టీ సర్వసభ్యసమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ పదవి కోసం ఆసక్తిదారుల పేర్లను నమోదు చేసుకున్నారు.

రథోత్సవం ప్రారంభం


అడ్డపల్లకిలో ఊరేగుతున్న స్వామివారు

విడపనకల్లు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లులో భీమలింగేశ్వర స్వామి రథోత్సవ వేడుకలను బుధవారం ప్రారంభించారు. సాయంత్రం అంచనహాలు గ్రామం నుంచి స్వామి వారి ఉత్సవ మూర్తిని అడ్డపల్లకిల్లో ఊరేగింపుగా గడేకల్లుకు తీసుకువచ్చారు. శనివారం స్వామి వారి మహా రథోత్సవం ఉంటుంది.

చట్టాన్ని దుర్వినియోగం కానివ్వకండి

గుంతకల్లుటౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): కొందరు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ.. అనవసరంగా తప్పుడు కేసుల్లో అమాయకులనుఇరికిస్తున్నారని, దీంతో వారి జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా చర్యలు తీసుకోవాలని వారు డీఎస్పీ కార్యాలయంలో బుధవారం డీఎస్పీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ కమిటీ సభ్యులు హరిప్రసాద్ యాదవ్, సాకే గోవిందు, కావలి మల్లికార్జున పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

తాడిపత్రి, జూలై 9(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూపరిషత్ టౌన్ సెక్రటరీ బాలకృష్ణ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. దీంతో బాధిత కుటుంబానికి శ్రీ విజయమణి సేవా ఫౌండేషన్ రూ.10 వేలు ఆర్థికసాయాన్ని బుధవారం అందజేసింది. ఇందులో వీహెచ్‌పీ నాయకులు రాధాకృష్ణ, శింగరి లక్ష్మీనారాయణ, గంగాధర్‌యాదవ్, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి పాల్గొన్నారు.

పంటలకు బీమా చేయించుకోండి


ఉరవకొండ, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం ద్వారా ప్రతి రైతు బీమా చేయించుకోవాలని ఏఓ రామకృష్ణ సూచించారు. మండలంలోని బూదగవిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బోరు బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటకు లద్దె పురుగు, పచ్చదోమ సోకిందని, వీటి నివారణకు దశపర్ని ద్రావణంను పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటనారాయణ, వీఏఏ షఫీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● యాడికి : రైతులు సకాలంలో పంటల బీమాకు ప్రీమియం చెల్లించి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా బుధవారం తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమాలకు రైతులు, కౌలురైతులు అర్హులని తెలిపారు. పంటల బీమా ప్రీమియం చెల్లింపులో ఏమైనా సందేహాలుంటే రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. పంటల బీమా ప్రీమియం కంది పంటకు ఎకరాకు రూ.80, జొన్నకు రూ84, మొక్కజొన్నకు రూ.132, ఆముదానికి రూ.80, వేరుశనగకు రూ.640, పత్తిపంటకు రూ.1140 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

వేరుశనగకు జింక్, ఐరన్ లోపం

విడపనకల్లు, జూలై 9(ఆంధ్రజ్యోతి): వేరుశనగకు సూక్ష్మపోషకాలు జింక్, ఐరన్ లోపం ఉందని, దీని వల్ల ఆకులు పసుపు రంగు మారి దిగుబడి తగ్గుతుందని వ్యవసాయ పరిశోధన కేంద్రం రేకులకుంట శాస్త్రవేత్త కేవీ సుధీర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఉండబండ, చీకలగురికి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐరన్ లోపం నివారణకు ఫెర్రస్ సల్ఫేట్ లేదా జింక్ సల్ఫేట్ ఒక గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఇదే విధంగా వేరుకుళ్లు తెగుళ్లకు, కాండం కుళ్లు తెగుళ్లకు అధిక నీటి తడులు ఇవ్వకూడదన్నారు. నత్రజని ఉరువులు వాడకం తగ్గించాలన్నారు. ఎం 45ను మూడు గ్రాములు లీటర్ నీటికి లేదా హెక్సా కొనిజోల్ 2 ఎంఎల్‌లు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకుంటే ఆకు మచ్చతెగులు నివారించ వచ్చు అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి హెచ్ పెన్నయ్య, ఏఈఓ కైలాష్ నాథ్, ఎంపీఈఓ లక్ష్మన్న పాల్గొన్నారు.

జలధికి తరలిన పీర్లు


జలధికి వెళుతున్న పీర్లు

బెళుగుప్ప, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులెన్నలో మంగళవారం రాత్రి వన్నూరుస్వామి, అక్బర్ లాలు స్వామి పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు పానకాలు, చక్కెర చదివించారు. బుధవారం పీర్లను జలధికి తరలించారు.

అష్టోత్తర కలశాభిషేకం

తాడిపత్రి, జూలై 9(ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం సమీపంలో ఉన్న షిర్డిసాయిబాబా మందిరం, సంజీవనగర్‌లో ఉన్న శివసాయి మందిరం, కడపరోడ్డులో ఉన్న శివసాయి, చిన్నపొలమడలో ఉన్న ప్రబోధానంద ఆశ్రమంలో గురుపౌర్ణమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టోత్తర కలశాభిషేకం, పాలాభిషేకంతోపాటు విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించారు.

దర్జాగా ప్రభుత్వ స్థలాల కబ్జా

బోర్డుల ఏర్పాటుకే పరిమితమైన రెవెన్యూ అధికారులు


ప్రధాన రహదారి పక్కనే ఏర్పాటు చేసిన బోర్డు.. పక్కనే అక్రమంగా నిర్మించిన గదులు

కూడేరు, జూలై9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొందరు ప్రభుత్వ భూములు, వాగులు, వంకలను దర్జాగా ఆక్రమించుకొని కట్టడాలు నిర్మించుకున్నారు. వాటిని తొలగించాల్సిన రెవెన్యూ అధికారులు కేవలం బోర్డులను ఏర్పాటు చేసి.. చేతులు దులుపుకుంటున్నారు. కూడేరులో ప్రధాన రహదారికి సమీపంలో సర్వే నంబర్ 568-1లో 9.22, సర్వేనంబర్ 562లో 8.65 ఎకరాల రోడ్డు, పోరంబోకు, వాగు పోరంబోకు భూములను ఆక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. ఆక్రమణదారులు వాటిని పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా కట్టడాలు నిర్మించుకున్నారు. మరికొందరు ఏకంగా అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. భారీ వర్షాలు వస్తే వాగులో నీరు వెళ్లలేక సమీపంలోని ఇళ్లలోకి ప్రవేశించే ప్రమాదముందని స్థానికులు వాపోతున్నారు. ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకొని .. ఆటస్థలం, పార్కును ఏర్పాటు చేయాలని కొందరు స్థానికులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు అర్జీలు ఇచ్చారు. అయినా ఫలితం శూన్యం. ఇప్పటికైన రెవెన్యూ అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ మహబూబ్‌బాషాను వివరణ కోరగా.. విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

హెచ్చెల్సీ పనుల పరిశీలన


హెచ్చెల్సీ పనులను పరిశీలిస్తున్న విప్ కాలవ

కణేకల్లు, జూలై 9(ఆంధ్రజ్యోతి): స్థానిక చిక్కణ్ణేశ్వర చెరువు వద్ద, నాగేపల్లి వద్ద జరుగుతున్న హెచ్చెల్సీ మరమ్మతు పనులను విప్ కాలవ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ నెల 15వ తేదీ లోపు హెచ్చెల్సీ కాలువకు నీటి సరఫరా జరిగే అవకాశం ఉందని, అంతలోపు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మార్కెట్‌యార్డ్ చైర్మన్ హనుమంతరెడ్డి, హెచ్చెల్సీ డీఈ దివాకర్‌రెడ్డి, జేఈ నరేంద్రమారుతి, టీడీపీ నాయకులు ఉన్నారు.

● సుపరిపాలనకు తొలి అడుగు : మండలంలోని గరుడచేడు గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని విప్ నిర్వహించారు. ఇందులో టీడీపీ నాయకులు వెంకటేశులు, బొజ్జిరెడ్డి, జలంధర్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డితో పాటు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే రాయదుర్గంలోని 7వ వార్డులోనూ విప్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

అమిలినేని ఇంటింటి ప్రచారం

బ్రహ్మసముద్రం, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ కొండాపురం, ఎరడికెర, పాలవెంకటాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు బుధవారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. సమస్యలపై ఆరా తీశారు. ఎరడికెరలో అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. ఇందులో పార్టీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

ఉద్దేహాళ్ సొసైటీ చైర్మన్‌కు సన్మానం


కొత్తపల్లి మల్లికార్జునను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఉద్దేహాళ్ సొసైటీ చైర్మన్‌గా కొత్తపల్లి మల్లికార్జునను నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయసహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన్ను స్థానిక టీడీపీ నాయకులు పయ్యావుల మోహన్, పయ్యావుల నాగరాజు, నవీన్, సైకిల్‌షాప్ హనుమంతు, సంగప్ప, క్రిష్ణాపురం శీనా, ఉద్దేహాళ్ శివా బుధవారం ఘనంగా సన్మానించారు.

బస్సు సర్వీస్ ప్రారంభం


బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న పూలనాగరాజు, వెంకటశివుడు యాదవ్

గుంతకల్లుటౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సౌకర్యార్థం గుంతకల్లు-పామిడి బస్సు సర్వీసును ఆర్టీసీ రాయలసీమ రీజనల్ జోనల్ చైర్మన్ పూలనాగరాజు స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం ప్రారంభించారు. గుంతకల్లు నుంచి వజ్రకరూరు, కట్టకిందపల్లి, ఎద్దులపల్లి, పామిడికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామప్రజలు, విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఈ సర్వీస్‌ను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, పట్టణ, మండల అధ్యక్షులు ముక్కన్న గారి గుణశేఖర్, రామన్న చౌదరి, నాయకులు తలారి మస్తానప్ప, బండారు ఆనంద్ పాల్గొన్నారు.

అరటికి తెగులు



యాడికి, జూలై 9(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో అరటిపంటను ఎక్కువగా ఆశించే సిగటోక తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి ఉద్యానవనశాఖ అధికారి ఉమాదేవి బుధవారం సూచించారు. ఇది బూజుజాతి శిలీంద్రం వలన వస్తుందని, ఈ శిలీంద్రం వర్షాకాలంలో వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు, ఆకులు 6-18 గంటల వరకు తడిగా ఉన్నప్పుడు ఎక్కువగా అభివృద్ధి చెంది తెగులును కలుగజేస్తుందన్నారు.

● తెగులు లక్షణాలు : ఆకులపైన చిన్నచిన్నపసుపు రంగు మచ్చలు ఏర్పడి అవి క్రమేపి పెరిగి పెద్దవై బూడిద రంగుతో మారి, ఒకదానితో ఒకటి కలిసిపోతాయన్నారు. తర్వాత ఆకులు ఎండిపోయి, కిరణజన్య సంయోగక్రియ జరగక, మొక్కలు గెలలు వేసినప్పుడు అవిపండక ముందే కాయలు రాలిపోతాయన్నారు.

● నివారణ చర్యలు: తెగులు వ్యాప్తి మొదలైనప్పుడు ప్రొపికోనజోల్ ఒక మిల్లీలీటరు, మినరల్ ఆయిల్ పది మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ మందును 25 రోజుల వ్యవధిలో మూడు సార్లు పిచికారి చేయాలని సూచించారు.

తెగులు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు ప్రొపికోనజోల్ ఒక మిల్లీలీటర్‌ను లీటర్ నీటిలో కలిపి మొదటి విడత పిచికారి చేయాలన్నారు. కార్బండజిమ్+ మాంకో జెబ్ మిశ్రమ మందు ఒక గ్రామును లీటరు నీటిలో కలిపి రెండో విడత పిచికారి చేయాలన్నారు. మూడో విడతగా ట్రైఫ్లోక్సీ స్ట్రోబిన్+ టెబ్యుకొనజోల్ మిశ్రమ మందు 1.4 గ్రామును లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు. నాలుగో విడతగా డైఫెన్ కొనజోల్ ఒక మిల్లీలీటర్‌ను ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు.

కేశవ్ చొరవ వల్లే అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, జూలై 9(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ హయాంలోనే తాగునీటి పథకాలకు జీవోలు తెచ్చామని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. ఆ జీవో చెత్తకుప్పలో వేయడానికి కూడా పనికి రాదు. వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్ల తాగు నీటి పథకాలు రద్దయితే... మంత్రి కేశవ్ సీఎం దృష్టికి తీసుకెళ్లి వాటిని పునరుద్ధరించారు. ఉరవకొండలో అభివృద్ధి జరిగిందంటే అది కేవలం కేశవ్ చొరవ వల్లే' అని ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం మండల, పట్టణ కన్వీనర్ విజయ్‌భాస్కర్, రామాంజినేయులు అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ... 'జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎమ్మెల్సీగా ఉండి కూడా నిన్ను స్టేజీ మీదకు కూడా ఆహ్వానించలేదు. అది నీ పార్టీలో నీస్థాయి. అలాంటి నీకు మంత్రిని విమర్శించే స్థాయి లేదు. ఎమ్మెల్సీగా ఉండి ఏ ఒక్క గ్రామంలోనైనా అభివృద్ధి చేశావా.?' అని ప్రశ్నించారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బీసీ మారెన్న, మండల ప్రధాన కార్యదర్శి గోవిందు, టీడీపీ నాయకులు తిమ్మప్ప, రహంతుల్లా, వరప్రసాద్ పాల్గొన్నారు.


గుంతకల్లులో..


ఉరవకొండలో..

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: కార్మిక హక్కులను కాలరాస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో నిరసన ర్యాలీలు, ధర్నాలు చేపట్టారు. పాత కార్మిక చట్టాలనే యథావిధిగా కొనసాగించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయరాదని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి, మున్సిపాలిటీ, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు ఇతర రంగాల్లోని కార్మికులను రెగ్యులర్ చేయాలని, అంగన్‌వాడీలు, ఆశాకార్యకర్తలు, హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ గ్రాట్యూటీ సౌకర్యాలు కల్పించాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. తాడిపత్రిలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు.



తాడిపత్రిలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఓబులు


కుందుర్పిలో..


బొమ్మనహాళ్‌లో..

క్రైం న్యూస్..

పశువుల అపహరణపై ఫిర్యాదు

గుంతకల్లుటౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వాల్మీకి నగర్‌లో కొన్ని రోజులుగా ఆవులు, ఎద్దులు, ఎనుములు అపహరణకు గురవుతున్నాయని బాధితులు దేవేంద్ర, బాలకృష్ణ, సంజీవ్, విజయ్ కసాపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ టీపీ వెంకటస్వామికి బుధవారం ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం విజయ్ తోటలో ఉన్న ఎద్దును అదే ప్రాంతానికి చెందిన యల్లన్న, రంగా తీసుకెళ్తుండగా.. విజయ్ వారిని నిలదీశాడు. విజయ్‌ను పక్కకు తోసి.. ఎద్దును అక్కడే వదిలేసి వారు పారిపోయారు. అలాగే దేవేంద్ర, బాలకృష్ణ, సంజీవ్‌లకు చెందిన పశువులు కూడా అపహరణకు గురయ్యాయి. దీంతో బాధితులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేబుల్‌వైరు చోరీ

యాడికి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలమడుగు గ్రామ రైతు బాబుగౌడ్‌కు చెందిన నిమ్మతోటలో బోరుబావికి ఉన్న 120 మీటర్ల కేబుల్‌వైరును మంగళవారం రాత్రి దుండగులు చోరీచేశారు. దాని విలువ సుమారు రూ.20వేలు ఉంటుందని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బాధిత రైతు తెలిపారు.

బంకు దగ్ధం

శెట్టూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాటకల్లులో మంగళవారం రాత్రి కిరాణ కొట్టులో సిలెండర్ పేలింది. దీంతో అందులోని సరుకులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.రెండు లక్షల వరకు నష్టం జరిగింది. కిరాణ కొట్టులో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు బుధవారం ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓకు సూచించారు.

ఆరుగురిపై కేసు

తాడిపత్రి, జూలై 9(ఆంధ్రజ్యోతి): పెద్దపప్పూరు మండలంలోని వరదాయపల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వాయిదా ఉండటంతో సోమవారం కొడవలితో స్థానిక కోర్టుకు హాజరయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు కోర్టు ఆవరణంలో వారి నుంచి కొడవలిని స్వాధీనం చేసుకున్న విషయం తెల్సిందే. ఈ విషయంలో ఆరుగురిపై కేసు నమోదుచేసినట్లు సీఐ సాయిప్రసాద్ బుధవారం తెలిపారు.

గోవుల తరలింపు అడ్డగింత

రాయదుర్గంరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): బళ్లారి నుంచి అనంతపురం వైపు ఒక పెద్ద కంటైనర్‌లో 17 ఆవులను తరలిస్తుండగా.. విశ్వహిందూ పరిషత్ నియోజకవర్గం అధ్యక్షుడు రాజేష్, నియోజకవర్గ గోరక్షకదళ్ అధ్యక్షుడు ప్రశాంత్ బుధవారం అడ్డుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

పోలీసుల అదుపులో వ్యక్తి

తాడిపత్రి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామానికి చెందిన రాజేష్ పిడిబాకు ఉంచుకొని.. బుధవారం వెళ్తుండగా .. పోలీసులు గుర్తించారు. అదుపులోకి విచారిస్తున్నారు.

ఘనంగా విఠోబస్వామి కల్యాణోత్సవం


హోమంలో పాల్గొన్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

పామిడి, జూలై 9(ఆంధ్రజ్యోతి): స్థానిక విఠోబస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రుక్మిణి సమేత విఠోబస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమంలో డీఎంహెచ్ఓ ఈబీ దేవి పాల్గొన్నారు. విఠోబస్వామి వారిని ఐరావత వాహనంపై ఊరేగించారు.

ఓటరు జాబితాపై శిక్షణ

రాయదుర్గంరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉన్న బూత్‌స్థాయి అధికారులకు ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపు.. తదితర వాటిపై స్థానిక డ్వామా కార్యాలయంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, ఎలెక్టోరోల్ రిజిస్ట్రేషన్ అధికారి రవిశంకర్‌రెడ్డి తప్పులు లేని ఓటర్ జాబితాను తయారు చేయడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఫారాలు 6, 7, 8ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు నాగరాజు, మునివేలు, బీఎల్‌ఓలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

రాయదుర్గం టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): మొహర్రం వేడుకల ముగింపు సందర్భంగా పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న చమ్మామసీద్ పీర్ల చావడిలో బుధవారం రాత్రి సుమారు 2000 మందికి అన్నదానం చేశారు. ఇందులో నిర్వాహకులు చమ్మా ఇబ్రహిం, చమ్మా నజీర్, చమ్మా సలాంసాబ్ పాల్గొన్నారు.

బీజేపీ కమిటీ ఎన్నిక

బొమ్మనహాళ్, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో బీజేపీ మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కురుబ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా గొల్ల ఎర్రిస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, రాయదుర్గం అసెంబ్లీ కన్వీనర్ హీరోజీరావు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యనారాయణరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు రవీంద్రనాథ్, కణేకల్లు, డీ. హీరేహాళ్ మండల బీజేపీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఆంజనేయులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

కూడేరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారు శాంత బుధవారం సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి మొత్తం 4,099 దరఖాస్తులు రాగా, ఇందులో 2,581 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. ఇంకా ఎవరైనా అర్హులంటే సచివాలయం, మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

రాయదుర్గంరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తులపై కొందరు పనిగట్టుకొని సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తుండటాన్ని నిరసిస్తూ.. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం బార్ అసోషియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లేశప్ప, ఈసీ వన్నూరుస్వామి, ఉపాధ్యక్షుడు రవిచంద్ర, ట్రెజరర్ రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు జగన్మోహన్‌రెడ్డి, లోకానంద, నరసింహారావు, జాన్సన్, రాజారావు పాల్గొన్నారు.